హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 78

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.5 । కనిష్ఠం 17.0



డిండి ప్రాజెక్టు

ఏదుల-డిండి లింక్‌పై నేడు కీలక నిర్ణయం

డిండి ఎత్తిపోతల పథకంలో కీలకమైన నీటి సేకరణ పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చే అంశంపై నేడు స్పష్టత రానుంది. ఈ పథకానికి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఏదుల రిజర్వాయర్ నుంచి రోజుకు అర టీఎంసీ చొప్పున 60 రోజుల్లో 30 టీఎంసీల నీటిని తీసుకోవాలని, 2024, మార్చి 13న రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరుచేసింది. ఆ తరువాతే ఏదుల నుంచి ఉల్పర బ్యారేజీ వరకు కాల్వలు, టన్నెల్స్, చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు రూ.1788.89కోట్లతో భారీ నీటి పారుదలశాఖ ప్రతిపాదించింది. శనివారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ పనులకు ఆమోదం లభిస్తే, వెంటనే పరిపాలనా అనుమతులు మంజూరు చేసి టెండర్లు పిలవాలని ఇరిగేషన్ అధికారులు నిర్ణయించారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- రూ.1788.90కోట్లతో ఇరిగేషన్‌శాఖ ప్రతిపాదనలు
- నేడు కేబినెట్ ఆమోదిస్తే టెండర్ల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం
- ఏదుల నుంచి నీటి సేకరణ ప్రతిపాదనపై పాలమూరు నుంచి వ్యతిరేకత
- ప్రభుత్వ నిర్ణయంపైనే అందరిచూపు
- దుందుభి నదిపై చెక్‌డ్యామ్ స్థానంలో రబ్బర్‌డ్యామ్‌కు ప్రతిపాదనలు
- రెండున్నరేళ్లలో పనులు పూర్తి చేస్తామంటున్న అధికారులు

డిండి ఎత్తిపోతలకు ఏదుల నుంచి నీటిని తరలించాలని ప్రభుత్వం భావిస్తుండగా, దీనిపై పాలమూరు జిల్లా నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కరువుపీడిత ప్రాంతమైన మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాకు ఉద్దేశించిన పాలమూరు ఎత్తిపోతల పథకం నుంచి నీటిని నల్లగొండ జిల్లాలో నిర్మించే డిండికి తరలించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అక్కడి నేతలు డిమాండ్ చేస్తున్నారు. రెండు ఉమ్మడి జిల్లాల నడుమ సున్నితమైన అంశం కావడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం పీఆర్ఎల్ఐ నుంచి నీటిని తీసుకోవాలని నిర్ణయించినా, ఏ రిజర్వాయర్ నుంచి తీసుకోవాలనే అంశాన్ని తేల్చకుండా దిగువన రిజర్వాయర్ల నిర్మాణాలు పూర్తిచేస్తూ వచ్చింది. రిజర్వాయర్‌ల పనులు కొలిక్కి వచ్చిన నేపథ్యంలో నీటిసేకరణకు నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య స్థితిని ఎదుర్కొన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏదుల నుంచి నీటిని సేకరించే విషయంలో స్పష్టత ఇచ్చింది. ఈ పనులపై కేబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారా? లేక మరికొంత సమయం తీసుకుంటారా? అనే విషయం శనివారం తేలనుంది.

పోతిరెడ్డిపల్లి వద్ద చెక్‌డ్యామ్ స్థానంలో రబ్బర్ డ్యామ్?

ఏదుల రిజర్వాయర్ నుంచి ఉల్పర బ్యారేజీ వరకు అవసరమయ్యే నిర్మాణాలకు రూ.1788.89కోట్ల వ్యయమవుతుందని అంచనా వేసిన ఇంజనీర్లు ఆ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలకు కేబినెట్ సమావేశం ఆమోదం తెలపాల్సి ఉంది. ఏదుల రిజర్వాయర్ నుంచి 800 మీటర్ల అప్రోచ్ చానల్, 2.525కిలోమీటర్ల ఓపెన్ కెనాల్, 9మీటర్ల డయాతో 16కిలోమీటర్ల టన్నెల్, మళ్లీ 3.050కిలోమీటర్ల ఓపెన్‌కెనాల్ నిర్మిస్తారు. మొత్తం 21.575కిలోమీటర్ల తర్వాత ఏదుల నుంచి నీరు దుందుభినదిలోకి వెళ్తుంది. అక్కడి నుంచి 6.325కిలోమీటర్ల తర్వాత ఉన్న పోతిరెడ్డిపాడు చెక్‌డ్యామ్‌కు 1.500కిలోమీటర్ల దిగువన ఉల్పర వద్ద బ్యారేజీ నిర్మిస్తారు. అయితే పోతిరెడ్డిపాడు..

- మిగతా 7వ పేజీలో...



నేటి నుంచి పంటల నమోదు సర్వే

క్షేత్ర స్థాయిలో పంటల సర్వేకు ప్రభుత్వం అనూహ్యంగా నిర్ణయించింది. వానాకాలంలో మెట్ట పంటలతో పాటు వరి, ఇతర పంటలు కూడా ఉంటాయి. అయితే వానాకాలం ముగిసి యాసంగి సీజన్ ప్రారంభమయ్యాక ప్రభుత్వం పంటల నమోదుకు నిర్ణయించడం విశేషం. అసలు ఈ సర్వే ఎందుకు నిర్వహిస్తున్నారనే దానిపై అధికారులకు కూడా సమాచారం లేదు. పంటల నమోదును మాత్రం ఈనెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పూర్తి స్థాయిలో నిర్వహించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. సిబ్బంది సరిపడా లేకపోతే అదనపు సిబ్బందితోనైనా సర్వే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

- ఈ నెల 8 వరకు ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశం
- ఉమ్మడి జిల్లాలోని 73 మండలాల్లో కొనసాగనున్న సర్వే
- ప్రతీ మండలంలో ఒక గ్రామం ఎంపిక
- ఆయా గ్రామాల్లో 400 నుంచి 500 ఎకరాల్లో పంటల పరిశీలన
- 'రైతు భరోసా' కోసమేనా?

గత ప్రభుత్వం 'రైతుబంధు' పేరుతో ఎకరాకు రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయం అందించగా, ఎకరాకు రూ.7,500 జమ చేస్తామని ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో 14వ తేదీ నుంచి సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'రైతు భరోసా' పేరుతో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ తరుణంలో

- మిగతా 6వ పేజీలో...

నేడు మునిసిపల్ కమిషనర్‌తో 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్

ఫోన్ చేయాల్సిన నెంబర్ 9849907754



రామగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను మునిసిపల్ కమిషనర్ ముసాబ్ అలీ దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఆంధ్రజ్యోతి' 'ఫోన్‌ఇన్' నిర్వహించనుంది. పట్టణ ప్రజలు వారి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లేందుకు శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9849907754 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చు.

ప్రశాంతంగా ముగిసిన పారా మెడికల్ పరీక్షలు

నల్లగొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో డిసెంబరు 23 నుంచి ప్రారంభమైన పారా మెడికల్ పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 1600మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన లు జరగకుండా పరీక్షల నిర్వహణకు కృషి చేసిన వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రతో పాటు ఇతర సిబ్బందిని ఆమె అభినందించారు.

అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

పీఅండ్‌ఎల్ ఐజీ ఎం.రమేష్



పాసింగ్ అవుట్ పరేడ్‌లో మాట్లాడుతున్న ఐజీ రమేష్

నల్లగొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బెటాలియన్‌లో శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ ప్రజలకు సమర్థ సేవలు అందించాలని పీఅండ్‌ఎల్ ఐజీ ఎం.రమేష్ అన్నారు. తొమ్మిది నెలల పాటు అన్నెపర్తిలోని 12వ బెటాలియన్‌లో శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఆయన మాట్లాడారు. పోలీస్‌శాఖలో అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ శాఖకు పేరు తీసుకురావాలన్నారు. తొమ్మిది నెలల కాలంలో క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి అభినందనలు తెలిపారు. మంచి వాతావరణంలో శిక్షణ పూర్తి చేసుకున్నారని, ఇక నూతన ఉత్సాహంతో సేవలు అందించాలన్నారు. అనేక సవాళ్లతో కూడిన పోలీస్‌శాఖలో ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొంటారన్నారు. బెటాలియన్ కమాండెంట్ కె.వీరయ్య మాట్లాడుతూ, తొమ్మిది నెలల కాలంలో వికారాబాద్, కామారెడ్డి, రామగుండం జిల్లాలకు చెందిన 450 మంది కానిస్టేబుళ్లు క్రమశిక్షణతో శిక్షణ పొందారన్నారు. అనంతరం శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల పరేడ్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్, అసిస్టెంట్ కమాండెంట్ వెంకటేశ్వర్లు, అంజనేయరెడ్డి, నర్సింగ్ వెంకన్నతో పాటు ఏవో అతీకూర్‌రెహ్మాన్, షర్మిలాదేవి, తదితరులు పాల్గొన్నారు.



అన్నింటికీ మూలాధారం సైన్స్

- కలెక్టర్ ఇలాత్రిపాఠి
- వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభించి ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అన్నింటికీ సైన్స్ మూలాధారం అని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్‌బీసీ వద్ద ఉన్న డాన్ బోస్కో పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలిసి జ్యోతి వెలిగించి ఆమె ప్రారంభించారు. అదేవిధంగా సావిత్రీబాయి పూలే జయంతి, మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సైన్స్ మన జీవనశైలి లో ఒక భాగమన్నారు. విద్యార్థులు ప్రతీ రోజు సైన్స్, గణితానికి సంబంధించి కనీసం ఒక్క పేజీ అయినా చదవడం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ, సైన్స్ ద్వారా శాంతి సమాజాన్ని సృష్టిద్దామని పిలుపునిచ్చారు. అందరూ సైన్స్ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల నైపుణ్యాలను బయటకు తీసేందుకు జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డీఈవో బి.భిక్షపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, జడ్పీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డాన్ బోస్కో స్కూల్ ప్రిన్సిపాల్ బాలశౌరి, ఉపరవా ణా కమిషనర్ వాణి, ఆర్డీవో లావణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్, ఎమ్మెల్సీ ఆవిష్కరించారు.అనంతరం విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను తిలకించారు. సందర్భంగా బాలభవన్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది.

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

(ఆంధ్రజ్యోతి, కట్టంగూరు): ధరణి పోర్టల్‌లోని మాడ్యుల్స్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం కట్టంగూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీచేసి ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించారు. కట్టంగూరు ప్రాథమిక కేంద్రాన్ని తనిఖీచేసి ఆశా కార్యకర్తలతో సమావేశమయ్యారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీవో జ్ఞానప్రకాష్‌రావు, మండల వైద్యాధికారి శ్వేత తదితరులు ఉన్నారు.

సావిత్రీబాయిపూలేకు ఘన నివాళి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): సావిత్రీబాయి పూలే జయంతి, మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి కలెక్టర్ ఇలాత్రిపాఠి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మోతీలాల్ పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

హాలియా, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందజేయాలని, సత్వర న్యాయంచేసేలా కృషి చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం హాలియా పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్, లాకప్, ఎస్‌హెచ్‌వో రూమ్‌ను, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీటీవీల ప్రాధాన్యంపై అవగాహన కల్పించి వాటి ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వినియోగంపై విద్యార్థులు, ప్రలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతీ రోజు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించాలన్నారు. దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, జూదం, అక్రమ ఇసుక, రేషన్ బియ్యం రవాణాపై ప్రత్యేక నిఘాపెట్టాలన్నారు. ప్రతీ ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, హాలియా సీఐ జనార్ధన్‌గౌడ్, ఎస్ఐ సతీష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్





జిల్లా ఉత్తమ మహిళా

రైతుగా వెంకటమ్మ

● హైదరాబాద్‌లో అందజేసిన మంత్రి సీతక్క



అవార్డుతో మహిళా రైతు పోలగోని వెంకటమ్మ

చిట్యాల రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా ఉత్తమ మహిళా రైతుగా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన పోలగోని వెంకటమ్మ ఎంపికయ్యారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ధనసరి సీతక్క ఈ అవార్డును వెంకటమ్మకు అందజేశారు. సన్మానించి, మెమోంటోను అందజేశారు. 1992 నుంచి వెంకటమ్మ వ్యవసాయం చేస్తోంది. ఆమె ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జిల్లా నుంచి ఉత్తమ మహిళా రైతుగా ఎంపిక చేసింది.

రేషన్ బియ్యం వ్యాపారిపై పీడీ యాక్ట్



నర్సింహారావుకు డీఎస్పీ రాజశేఖర్‌రాజు సమక్షంలో డిటెన్షన్ ఆర్డర్‌ను అందజేస్తున్న సీఐ వీరబాబు

మిర్యాలగూడ అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఏజెంట్లను నియమించుకొని రేషన్ బియ్యం సేకరించి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్న వ్యక్తిపై నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దాచేపల్లి మండలకేంద్రానికి చెందిన మందపాటి నర్సింహారావు కొన్నేళ్లుగా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏజెంట్లను నియమించుకుని రేషన్ బియ్యం సేకరించి ఏపీకి తరలిస్తున్నాడు. 2015 నుంచి రేషన్ బియ్యం దందా చేస్తూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. మిర్యాలగూడ సబ్‌డివిజన్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో నర్సింహారావుపై పదుల సంఖ్యలో కేసులు నమోదుకావడంతో రౌడీషీట్ తెరిచినట్లు చెప్పారు. గతేడాది నవంబర్ 17వ తేదీన నర్సింహారావును అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించగా, 19 రోజుల పాటు జైలులో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చాడు. అనంతరం తీరు మారకుండా రేషన్ బియ్యం దందా కొనసాగిస్తున్నాడు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తుండటంతో జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ నమోదు చేసి శుక్రవారం అదుపులోకి తీసుకుని చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న మిర్యాలగూడరూరల్ సీఐ వీరబాబును డీఎస్పీ అభినందించారు.

నాలుగు దుకాణాల్లో చోరీ



చోరీ జరిగిన ఆంజనేయ సీడ్స్, ఫెర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పెద్దవూర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలోని నాలుగు దుకాణాల్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. స్థానిక వై జంక్షన్ సమీపంలోని అంజనేయ అగ్రిమార్ట్ ఫర్టిలైజర్స్‌తో పాటు మరో మూడు దుకాణాల్లో రూ.40వేల నగదును చోరీ చేశారు. ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం పెద్దవూరలోని వై జంక్షన్ నుంచి సాగర్‌రోడ్డులోని ఆంజనేయ అగ్రిమార్ట్ ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ దుకాణంలో దొంగలు గురువారం రాత్రి చొరబడి కౌంటర్‌లోని సుమారు రూ.40వేల నగదును అపహరించినట్లు ఎస్‌ఐ తెలిపారు. అదే విధంగా ఆ దుకాణం పక్కనే ఉన్న చిరంజీవికి చెందిన హార్డ్‌వేర్ దుకాణంలో, సతీష్‌కు చెందిన బైక్ మెకానిక్ దుకాణంలోకి ప్రవేశించారు. అయితే అక్కడ విలువైన వస్తువులు ఏవీ తీసుకెళ్లలేదని తెలిపారు. ఆంజనేయ అగ్రిమార్ట్ షాపు యజమాని షైనేనీ గిరిధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల చోరీలు జరుగుతున్న నేపథ్యంలో దుకాణ యజమానులు కౌంటర్లలో అధికమొత్తంలో డబ్బులు నిల్వ ఉంచవద్దని, విలువైన వస్తువులు కూడా పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ సూచించారు.

బాలుడిపై లైంగిక దాడి యత్నం

సూర్యాపేటక్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బాలుడిపై లైంగిక దాడికి యత్నించిన యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఈ నెల 1వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ ఘటన జరిగింది. సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన సాయిగణేష్ తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సాయిగణేష్ ఏ పని చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. ఈ నెల 1వ తేదీన తన ఇంటి సమీపంలో నివాసం ఉంటున్న 11 ఏళ్ల బాలుడికి మాయమాటలు చెప్పి బలవంతంగా తన ఇంటికి తీసుకెళ్లాడు. ఆ సమయంలో బాలుడు తల్లిదండ్రులు వారి వారి పనులకు వెళ్లగా ఇంట్లో బాలుడొక్కడే ఉన్నాడు. బాలుడిపై లైంగిక దాడికి యత్నించటంతో అక్కడినుంచి తప్పించుకుని బయటకు వచ్చి అటుగా వెళుతున్న స్థానికులకు జరిగిన విషయాన్ని తెలిపాడు. అనంతరం తల్లిదండ్రులకు బాలుడు సమాచారం ఇవ్వగా వారు పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో లైంగిక దాడికి యత్నించిన సాయిగణేష్‌పై ఈ నెల 2వ తేదీన పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు తెలిపారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిపారు.

పదేళ్ల పోరాటం ఫలించేనా?

● తిరుమలగిరిలో ఆర్టీసీ డిపో ఏర్పాటు ఎప్పటికో
● స్థలం ఉన్నా, పట్టించుకోని వైనం
● రెండు నెలలుగా కొనసాగుతున్న ఉద్యమం

వ్యాపార కూడలిగా నిత్యం రద్దీగా ఉండే సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పట్టణంలో బస్ డిపో ఏర్పాటు కోసం పదేళ్లుగా ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ పట్టణం నాలుగు జిల్లాలకు కూడలిగా ఉంది. నిత్యం పెద్దసంఖ్యలో ప్రజలు ఈ పట్టణం మీదుగానే ప్రయాణాలు సాగిస్తుంటారు. అలాంటి ప్రాముఖ్యం కలిగిన ఈ ప్రాంతంలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు కోసం ఉద్యమాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వాలు మారినా, నాయకులు మారినా డిపో హామీ మాత్రం నెరవేరడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మరోసారి డిపో ఏర్పాటు అంశంపై స్థానికులు ఆందోళన బాటపట్టారు. ఈ ప్రభుత్వమైనా తమ కలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-తిరుమలగిరి)



ఆర్టీసీ డిపోకు కేటాయించిన స్థలంలో కడుతున్న మునిసిపల్ బిల్డింగ్ భవనం



క్రాస్‌రోడ్ వద్ద రోడ్లపై నిలబడ్డ ప్రయాణికులు

మేజర్ పంచాయతీగా ఉన్న తిరుమలగిరి పట్టణాన్ని రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన సమయంలో మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. వ్యాపార, వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ పట్టణానికి, స్థానిక మార్కెట్‌కు నిత్యం చుట్టుపక్కల నుంచి పెద్దసంఖ్యలో రైతులు, ప్రజలు వస్తుంటారు. సరైన బస్సు సౌకర్యాలు లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రంగా తుంగతుర్తితో పాటు ఏ మండలాలకు చెందిన వివిధ గ్రామాలకు సరైన బస్‌సౌకర్యం లేదు. తిరుమలగిరిలో బస్ డిపో నిర్మించి మారుమూల గ్రామాలకు పట్టణాలకు అన్నివేళల్లో బస్‌సౌకర్యం కల్పించాలని పదేళ్ల ప్రజలు పోరాటం చేస్తూనే ఉన్నారు. డిపో సాధన కోసం నిర్విరామంగా ఉద్యమాలు చేస్తున్నారు. నిరాహార దీక్షలతో పాటు పలువురు మంత్రులు, ఆర్టీసీ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించి నిత్యం డిపో అంశం ప్రాధాన్యాన్ని ప్రభుత్వానికి గుర్తు చేస్తూనే ఉన్నారు. గతేడాది తిరుమలగిరి డిపో సాధన సమితి పేరిట కమిటీ ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు.

నాలుగు జిల్లాల కూడలి

తిరుమలగిరి మునిసిపల్ కేంద్రం నాలుగు దిక్కులా జనగామ, యాదాద్రిభువనగిరి, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు ప్రధానకూడలి. ఆయా జిల్లాలకు చెందిన మండలాల నుంచి నిత్యం పెద్దసంఖ్యలో హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ వెళ్లేందుకు తిరుమలగిరి పట్టణానికి వచ్చి బస్సులను ఆశ్రయిస్తుంటారు. చుట్టుపక్కల మండలాలు సుమారు 300 గ్రామాల ప్రజలు తమ, తమ అవసరాలకోసం, తిరుమలగిరికి వస్తుంటారు. నియోజకవర్గంలోనే వ్యాపారపరంగా తిరుమలగిరి అతిపెద్ద పట్టణం. దీంతో ఎంతోమంది తిరుమలగిరికి రాకపోకలకు సరైన బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే తిరుమలగిరి మండలంతో పాటు, చుట్టుపక్కల మండలాలలోని కొన్ని గ్రామాలకు ఇప్పటివరకు బస్ సౌకర్యం లేదు. ఇప్పటికీ ప్రైవేటు వాహనాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

స్థలం ఉన్నా, నిర్మాణానికి ఆటంకం

గత పదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వంలో మినీ బస్ డిపో కోసం మునిసిపల్ కేంద్రంలో 3.20 ఎకరాల స్థలం కేటాయించి, ఆర్టీసీ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. ఇప్పుడు ఆ స్థలంలో నూతనంగా మునిసిపల్ బిల్డింగ్ నిర్మాణం చేపడుతున్నారు.

తిరుమలగిరిలోనే బస్ డిపో నిర్మించాలి



తిరుమలగిరిలోనే బస్ డిపో నిర్మించాలి. మరో చోటుకు తరలించొద్దు. డిపో నిర్మిస్తే చుట్టుపక్కల సుమారు 400 గ్రామాలకు బస్ సౌకర్యం కలుగుతుంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి తిరుమలగిరిలోనే డిపో నిర్మించేందుకు కృషి చేయాలి. లేనిపక్షంలో ప్రజలతో మమేకమై ఉద్యమాలు చేపడతాం.

కడెం లింగయ్య, డిపో సాధన సమితి కన్వీనర్

గ్రామాలకు బస్‌సౌకర్యం కలుగుతుంది



తిరుమలగిరితో పాటు, నియోజకవర్గంలోని మండలాలు, పక్క జిల్లాల మండలాలకు నేటికి బస్ సౌకర్యం లేదు. డిపో నిర్మించడం వల్ల అన్ని గ్రామాలకు బస్ సౌకర్యం కలుగుతుంది. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగినట్లవుతుంది.

కటుకూరి ఉపేందర్, తిరుమలగిరి

అయితే ఈ భూమి విషయంలో ఆర్టీసీ యాజమాన్యం కోర్టుకు వెళ్తామని చెప్పినప్పటికీ ఆచరణలోకి రాలేదు. దీంతో అప్పటి ప్రభుత్వం మునిసిపల్ కార్యాలయ నిర్మాణానికే మొగ్గుచూపింది.

నిరుపయోగంగా బస్టాండ్

పాతతిరుమలగిరి ప్రాంతంలో 2000 సంవత్సరంలో 2.20 ఎకరాల స్థలంలో బస్టాండ్ నిర్మించినా, అది నిరుపయోగంగా మారింది. పాత గ్రామంలో నిర్మించడంతో అక్కడికి అన్నిడిపోల బస్సులు వెళ్లలేదు. ఊర్లోకి వెళ్లి, తిరిగి క్రాస్‌రోడ్డుకు రావడానికి డీజిల్ ఖర్చు అధికం అవుతుందని బస్‌లు బస్టాండ్‌లోకి వెళ్లడం మాన్పించారు. పాత ఊరు ప్రజలంతా ఏ ఊరికి వెళ్లినా, వచ్చినా, ఆటోలల్లో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

బస్టాండ్ స్థలంలో డిపో, సంత మైదానంలో బస్టాండ్

తిరుమలగిరిలోనే బస్‌డిపోకు అన్నిరకాల అనువైన వసతులు ఉన్నాయని, ఆర్టీసీ సంస్థ డిపో ఏర్పాటుచేస్తే లాభసాటిగా ఉంటుందని స్థానికులు అభిప్రాయం వ్యంచేస్తున్నారు. బస్‌స్టాండ్ స్థలంలో బస్‌డిపో, సంత మైదానంలో బస్‌స్టాండ్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని డిపో సాధన సమితి, ప్రజలు కోరుతున్నారు.

రేపు సబ్బండ కులాల దీక్ష

తిరుమలగిరిలో బస్‌డిపో సాధనలో భాగంగా ఈనెల 5వ తేదీన చేపడుతున్న సబ్బండ కులాల దీక్షను విజయవంతం చేయాలని డిపో సాధన సమితి కన్వీనర్ కడెం లింగయ్య ఓ ప్రకటనలో కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



మల్లికార్జున్ (ఫైల్ ఫొటో)

దేవరకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దేవరకొండలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ నర్సింహులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవరకొండ పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి జక్కుల మల్లిఖార్జున్(42) బస్టాండ్ నుంచి బైక్‌పై వెళుతున్నాడు. దేవరకొండ డిపో నుంచి నల్లగొండకు వెళుతున్న బస్సును వెనుక భాగం నుంచి ఢీకొని అనంతరం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు దేవరకొండ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మల్లికార్జున్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన అమ్మమ్మ వీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు



పరమేష్ (ఫైల్ ఫొటో)

నార్కట్‌పల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు గురువారం రాత్రి మృతి చెందాడు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లికి చెందిన దైద పరమేష్(31) డిసెంబరు 28న తన వ్యవసాయ బావి వద్ద పొలం పనులు చూసుకుని మిత్రునితో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తూ రోడ్డు ఎక్కుతుండగా డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పరమేశ్ తలకు బలమైన గాయాలు కాగా నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో తరలించారు. చికిత్సపొందుతూ ఆయన గురువారం మృతి చెందాడు. కాగా పరమేశ్ కుటుంబానికి వైద్య ఖర్చులను భరించే ఆర్థిక స్థోమత కూడా లేకపోవడంతో గ్రామానికి చెందిన 10వ వార్డు మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు శిరబోయిన రాజు, మిత్రుల సహకారంతో విరాళాలు సేకరించి వైద్యఖర్చులకు అందజేసినా, ఫలితం దక్కలేదు.

రెడీమిక్స్ వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు



రెడిమిక్స్ వాహనం ఢీకొని పల్టీ కొట్టిన కారు

భువనగిరిరూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కారును రెడీమిక్స్ లోడ్‌తో వెళ్తున్న వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి శివారులోని కలెక్టరేట్ సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలెక్టరేట్‌లో ఎస్‌టీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రావణ్‌కుమార్, రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్ కారులో కలెక్టరేట్‌కు వెళ్తున్నారు. వెనుక నుంచి అతి వేగంగా అజాగ్రత్తగా రెడీమిక్స్ లోడ్‌తో వెళ్తున్న భారీ వాహనం కారును వెనుక నుంచి ఢీకొట్టింది.ఈ ఘటనలో కారు బోల్తా కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న శ్రావణ్‌కుమార్, సుదర్శన్ కేకలు వేయడంతో స్థానికులు గమనించి వారిని సురక్షితంగా బయటకుతీశారు. వారిద్దరికి గాయాలయ్యాయి. త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. గాయపడిన వారిని స్థానికులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో వారణాసి సంతోష్‌కుమార్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో

కొట్టం దగ్ధం

పెన్‌పహాడ్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామంలో శుక్రవారం పూరికొట్టం, వ్యవసాయ సామాగ్రి దగ్ధమయ్యాయి. బాధితుడు, రైతు కీర్తి ఎలమంచయ్య, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చీదెళ్ల గ్రామానికి చెందిన ఎలమంచయ్య వ్యవసాయ క్షేత్రంలో పూరి కొట్టంలో వ్యవసాయానికి సంబంధించిన డ్రిప్ సామాగ్రి, 10 క్వింటాళ్ల పత్తి, ఇతర సామాగ్రి ఉంచాడు. వ్యవసాయ బోర్‌కు వెళ్లే సర్వీస్ వైర్ తెగి షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు ఏర్పడి కొట్టానికి క్షణాల్లో అంటుకున్నాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చినా, ఫైరింజన్ వచ్చే సమయానికే పూరి కొట్టం, సామాగ్రి కాలి బూడిదైంది. కొద్దిపాటి మంటలు ఉండడంతో ఫైర్‌ఇంజన్‌తో మంటలు నిప్పులను ఆర్పివేశారు. రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు ఎలమంచయ్య వెల్లడించాడు. విషయం ఆలస్యంగా తెలిసిందని, శనివారం సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తామని తహసీల్దార్ ధరావత్ లాలునాయక్ తెలిపారు.

నేటి నుంచి పంటల నమోదు సర్వే

(5వ పేజీ తరువాయి)

ప్రారంభంకానున్న సర్వే ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. అయితే రైతు భరోసాపై ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు రానప్పటికీ ఆంక్షలు లేకుండా ఎకరాలకు పరిమితి లేకుండా నగదు జమచేస్తామని ప్రభుత్వం పేర్కొంటోంది. ఓ వైపు పంటల సర్వే చేయిస్తున్న ప్రభుత్వం మరో వైపు 5, 6, 7 తేదీల్లో గ్రామసభలు నిర్వహించి రైతు భరోసా' దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించింది.

73 మండలాల్లో ఒక్కో గ్రామం ఎంపిక

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 73 మండలాలు ఉన్నాయి. ఒక్కో మండలంలో ఒక్కో గ్రామాన్ని మొత్తం 73 గ్రామాలను ఇప్పటికే గుర్తించగా, శనివారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు పంటల నమోదు సర్వేను అధికారులు నిర్వహించనున్నారు. మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన అధికారులు, ఆ గ్రామాల్లో 400 నుంచి 500 ఎకరాల వరకు పంటలను పరిశీలించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. 400 నుంచి 500 ఎకరాల మధ్యలో ఏ ఒక్క సర్వే నంబర్ మిస్ కాకుండా పంట నమోదు సర్వేను పూర్తిచేస్తారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులు, కలెక్టర్లు ఈ సర్వేపై క్షేత్రస్థాయి అధికారులతో పాటు మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సర్వే బాధ్యతలను వ్యవసాయ విస్తరణాధికారులు చూడనుండగా, మండల వ్యవసాయ అధికారులు పర్యవేక్షించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేను 400 నుంచి 500ఎకరాల మధ్యలో సర్వేనంబర్లు బ్రేక్ కాకుండా ఏ పంటలు వేశారనే దాన్ని క్షుణ్ణంగా పరిశీలించి యాప్‌లో పకడ్బందీగా నమోదుచేయనున్నారు.

పూర్తిస్థాయి సర్వేకు సమయం లేకే

రైతు భరోసాపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. అయితే ఎలాంటి ఆంక్షలు లేకుండా నగదు చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతున్నా మార్గదర్శకాలు విడుదలచేస్తేనే స్పష్టత వస్తుంది. 5, 6, 7 తేదీల్లో రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని, వారు సాగుచేస్తున్న పంటల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న ప్రభుత్వం, మరోవైపు పంటల సర్వేను పూర్తిస్థాయిలో కాకుండా పైలట్ ప్రాజెక్టుగా గ్రామాలను ఎంపిక చేయడం గమనార్హం. దీంతో 'రైతుభరోసా' కోసమే పంటల సర్వే చేస్తున్నారనే చర్చ సాగుతోంది. సంకాంత్రి పండుగ నుంచే రైతు భరోసా నగదు జమచేస్తామని చెబుతున్నందున పూర్తిస్థాయి సర్వే ఈ కొద్ది సమయంలో చేపట్టే అవకాశాలు లేకపోవడంతో రైతు భరోసా' విషయంలో ప్రభుత్వం కచ్చితంగా ఉందనే విషయం రైతులకు తెలియజేసేందుకే పైలెట్ ప్రాజెక్టుగా గ్రామాలను ఎంపిక చేసినట్టు చర్చ నడుస్తోంది. పంటలు సాగుచేసిన భూముల సర్వే నెంబర్ వివరాలను గ్రామసభల్లో కచ్చితంగా ఇవ్వాలనే నిబంధన పెట్టింది. అదే సమయంలో పంటల సర్వేను చేపట్టనుండటంతో సాగులో లేని భూములకు రైతు భరోసా' ఇచ్చేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసేందుకే ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది.

ఐదు రోజుల్లో పంటల సర్వే



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు పంటల సర్వేను చేపట్టి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తాం. ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని 400 నుంచి 500 ఎకరాల్లో సర్వే నిర్వహిస్తాం. ఆ ఎకరాల మధ్య ఏ ఒక్క సర్వే నెంబర్ కూడా బ్రేక్ చేయకుండా పంటలను పరిశీలిస్తాం. సిబ్బంది కొరత లేకుండా సకాలంలో సర్వే పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మొత్తం ఐదు రోజుల్లో లక్ష్యం మేరకు సర్వే పూర్తి చేస్తాం.

పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

ఉపాధి కరువై వలసలు



శిథిలావస్థకు చేరిన ఇళ్లు

నేరేడుగొమ్ము, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కరువై చెంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నల్లగొండ జిల్లాలోని ఉమ్మడి చందపేట మండలంలోని పలుగుతండా చెంచుకాలని, గువ్వలగుట్ట, కంబాలపల్లి, చిత్రియాల, రేకులగడ్డ, పొగిళ్ల, రేకులవలయం, గన్నేర్లపల్లి గ్రామాల్లో 1,200 మంది చెంచులు జీవనం సాగిస్తున్నారు. గతంలో అడవిలో తేనె, వేటకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేవారు. కానీ అడవుల్లోకి వెళ్లేందుకు అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మరికొంత మంది చెంచులు జీవనోపాధి లేక ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారు. నేరేడుగొమ్ము మండలం పలుగుతండా చెంచుకాలనీలో 50 కుటుంబాలకు 152 మంది జీవిస్తున్నారు. వీరికి గతంలో రాష్ట్ర ప్రభుత్వం 32 కుటుంబాలకు రెండు ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి పంపిణీ చేసింది. అందులో నాలుగు కుటుంబాలకు ఇందిర జలప్రభ కింద బోర్లు వేయడంతో ఆ నాలుగు కుటుంబాలు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాయి. మిగతా కుటుంబాలు నీటి వనరులు లేకపోవడంతో పత్తి పంటను సాగుచేస్తున్నారు. గిరి వికాస్ కింద తమ వ్యవసాయ భూములకు బోర్లు వేయించాలని మండల అధికారులకు వినతులు అందించినా ఎలాంటి స్పందనలేదని చెంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఐటీడీఏ అధికారులు ఎనిమిదేళ్ల నుంచి ఉపాధి పనులు కల్పించడం లేదని వారు తెలిపారు. గతంలో ఐటీడీఏ కింద ఉపాధిహామీ పనుల కోసం 97 జాబ్ కార్డులు మంజూరు చేసి పనులు కల్పించడంతో తాము పనులు చేసి జీవనం ఆనందంగా గడిపామని, గత 8 ఏళ్ల నుంచి అధికారులు ఉపాధి పనులు కల్పించలేదన్నారు. ఇదే విషయమై అధికారులను కలవగా 34 మందికి మాత్రమే జాబ్‌కార్డులు మంజూరు చేశారని, వారికి సైతం పనిదినాలు కల్పించలేదని చెంచులు తెలిపారు. ఇటీవల పత్తి ఏరేందుకు వెళ్లి కుటుంబాలను పోషించుకున్నామని, సీజన్ అయిపోయిందని, పనులేక వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ఉపాధి కల్పించాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఐటీడీఏలో భాగంగా ఇళ్లు నిర్మించగా అవి శిథిలావస్థకు చేరుకున్నాయని, నూతనంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని చెంచులు కోరుతున్నారు.

ఉపాధిహామీ ద్వారా పనులు కల్పించాలి

చెంచులకు ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించాలి. గతంలో ఐటీడీఏ జాబ్‌కార్డులు ఇచ్చి పనులు కల్పించింది. ప్రస్తుతం పనుల్లేక వలసలకు సన్నద్ధమవుతున్నాం. ప్రభుత్వం పని కల్పించడంతో పాటు నూతనంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఆదుకోవాలి.

చిత్ర మల్లయ్య, పలుగుతండా చెంచుకాలనీ,

పనులు కల్పించి వలసలు నివారించాలి



అటవీ సంపద లేకపోవడంతో పూటగడవడం భారమైంది. ఉపాధి పథకం ద్వారా పనికల్పించడంలేదు. ప్రభుత్వం పని కల్పించి, రుణాలు అందజేసి ఆదుకోవాలి.

దాసరి అంజయ్య, పలుగుతండా, చెంచుకాలని

ఉపాధిహామీ ద్వారా పని కల్పిస్తాం

ఉపాధిహామీ పథకం ద్వారా చెంచులకు ప్రభుత్వం పని కల్పిస్తోంది. గతంలో ఐటీడీఏ ఆధీనంలో ఉండేది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మండలస్థాయిలో అధికారులకు బాధ్యతలు అప్పగించింది. మండల అధికారులు ఆయా చోట్ల చెంచులకు, కూలీలకు పని కల్పిస్తున్నారు.

మల్లేష్, ఐటీడీఏ ప్రత్యేక అధికారి

పోలీస్‌స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న గోపి

హుజూర్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పోలీసుస్టేషన్ ఎదుట ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడు ఊదరి గోపి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోపి తండ్రి కొంతకాలం క్రితం మృతిచెందగా, తల్లి పార్వతమ్మతో కలిసి ఫణిగిరిగట్టు ప్రాంతంలో గుడిసెలో ఉంటున్నారు. అక్కడే ఉన్న రైతువేదిక వద్ద గోపి తల్లి పార్వతమ్మ స్వీపర్‌గా పనిచేస్తోంది. రైతువేదికకు ఇటీవల ప్రభుత్వం ఎల్‌ఈడీటీవీ, కంప్యూటర్ మానిటర్, సీపీయూ, వీడియో కెమెరా, రెండు సౌండ్‌బాక్సులు మంజూరు చేసింది. రైతువేదిక తాళాలు పార్వతమ్మ వద్ద ఒకటి, ఏఈవో ప్రణయ్ వద్ద మరొకటి ఉన్నాయి. నవంబరు 12న రైతువేదికలోని రూ.2లక్షల విలువైన వస్తువులు చోరీ అయ్యాయని ఏవో స్వర్ణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. అనుమానితులుగా స్వీపర్ పార్వతమ్మ, ఆమె కుమారుడు గోపిలను చేర్చారు. దీంతో ఎస్‌ఐ ముత్తయ్య ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి పలుమార్లు విచారణ చేశారు. విచారణ నిమిత్తం పిలిపించటంతో శుక్రవారం మధ్యాహ్నం స్టేషన్ వద్దకు వచ్చిన గోపి గన్నేరు పప్పు తిని కుప్పకూలిపోవటంతో పోలీసులు ఏరియాఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం సూర్యాపేటజిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం గోపి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది. ఇదిలా ఉండగా నెలరోజులుగా తరచూ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన ఎస్‌ఐ ముత్తయ్య తమను పోలీసులచే కొట్టించారని వారు ఆవేదన వ్యక్తంచేశాడు. దొంగతనం చేసినట్లు అంగీకరించాలని, లేదంటే వస్తువులకు సంబంధించిన రూ.2లక్షలు ఇవ్వాలన్నారని ఆరోపించారు. ఏ తప్పు చేయలేదని వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదని, రైతువేదిక రెండో తాళం ఏఈవో ప్రణయ్ వద్ద ఉండగా, ఆయన్ను ఎందుకు విచారించడం లేదని గోపి, ఆయన తల్లి పార్వతమ్మ అన్నారు.

విచారణ చేయడం సాధారణం: ఎస్‌ఐ ముత్తయ్య

రైతు వేదికలో జరిగిన దొంగతనం కేసులో ఏవో స్వర్ణ ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. గతంలో విచారణ చేశామని గోపిని కొట్టలేదన్నారు. గురువారం విచారించామని, శుక్రవారం ఉదయం మరోసారి రమ్మని కబురు చేయగా, వస్తూనే గన్నేరు పప్పు తిన్నట్లు డ్రామా చేశాడన్నారు.

ఆవిష్కరణలు.. అద్భుతం

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నల్లగొండలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో అకట్టుకుంటున్నాయి. జిల్లావ్యాప్తంగా 100కు పైగా స్టాళ్లను ఏర్పాటుచేసి విద్యార్థులు తమలోని ప్రతిభను చాటుతున్నారు. ముఖ్యంగా కొందరు విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు ప్రదర్శనకు వచ్చిన వారందరిని ఆలోచింపచేస్తున్నాయి.

● నల్లగొండ టౌన్



ఉమెన్ సేఫ్టీ డివైజ్
విద్యార్థి పేరు : ఎ.సిరి చందన
తరగతి : పదో తరగతి
పాఠశాల : టీఎస్ మోడల్ స్కూల్, దేవరకొండ.
ప్రదర్శనతో ఉపయోగం: మహిళలు, విద్యార్థినులకు ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఆకతాయిల వేధింపులకు గురైనప్పుడు వారికి సరైన సమాధానం చెప్పవచ్చు. పనిచేసే చోట, రోడ్ల వెంట వెళ్లేటప్పుడు దీన్ని ఉపయోగించి వేధింపులను అరికట్టవచ్చు.
గైడ్ టీచర్: కె.శివ
ప్రదర్శనకైన వ్యయం : రూ.1000



సెల్ ఫోన్ చార్జింగ్ విత్ సైకిల్ డైనమో
విద్యార్థి పేరు: కె.కోమల్
తరగతి: పదో తరగతి.
పాఠశాల : బక్కల్‌వాడి, మిర్యాలగూడ.
ప్రదర్శనతో ఉపయోగం: వాహనంపై వెళ్లేటప్పుడు ఫోన్ చార్జింగ్ చేసుకోవచ్చు. నిత్యం వివిధ పనులపై తిరిగేవారికి (డెలివరి బాయ్స్) ఎంతో ఉపయోగపడుతుంది.
గైడ్ టీచర్ : కె. శ్రీనివాసరావు.
ప్రదర్శనకైన వ్యయం: రూ.3వేలు.



ఎనర్జీ రోసోర్స్ మిషన్
విద్యార్థి పేరు: ఎన్.అంజలి
తరగతి : పదో తరగతి
పాఠశాల : జడ్పీహెచ్ఎస్, చింతపల్లి
ప్రదర్శనతో ఉపయోగం: దీని ద్వారా గుట్టలు, కొండలులాంటి విద్యుత్ సరఫరా లేని మారుమూల ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించవచ్చు. ఫలితంగా కొండలు, గుట్టలులాంటి చోట్ల విద్యుత్ ప్రసరింపజేయవచ్చు.
గైడ్ టీచర్ : జగిరాం
ప్రదర్శనకైన వ్యయం : రూ.600



స్మార్ట్ గ్లూకోజ్ స్టాండ్
విద్యార్థి పేరు: ఎం. వీరమణికంఠ
తరగతి : పదో తరగతి
పాఠశాల : జడ్పీహెచ్ఎస్, చెల్మారెడ్డిగూడెం, అనుమల
ప్రదర్శనతో ఉపయోగం: ఆస్పత్రిలలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. రోగికి గ్లూకోజ్ పెట్టిన తర్వాత ఈ పరికరాన్ని అమర్చితే గ్లూకోజ్ పూర్తవ్వగానే సైరన్ మోగుతుంది. దీంతో వెంటనే స్పందించి వార్డుబాయ్ గ్లూకోజ్ తీయడం లేదా మార్చడం చేయవచ్చు. తద్వారా రోగి ఒంట్లోని రక్తం తిరిగి గ్లూకోజ్ బాటిల్‌లోకి వెళ్లకుండా నివారించవచ్చు.
గైడ్ టీచర్ : పి.నిర్మల
ప్రదర్శనకైన వ్యయం : రూ.2వేలు.



ఆటోమెటిక్ వాటర్ పంపింగ్ సిస్టమ్
విద్యార్థి పేరు: బి.దీపక్‌రెడ్డి, బి.నితీష్‌కుమార్.
తరగతి: ఎనిమిదో తరగతి
పాఠశాల: జడ్పీహెచ్ఎస్, చిన్నకాపర్తి, చిట్యాల.
ప్రదర్శనతో ఉపయోగం: నీటి వనరులు వృథా కాకుండా పొదుపు చేయవచ్చు. బోరుబావుల్లో నీటి లభ్యత ఉన్నప్పుడు ఆటోమెటిక్‌గా బోరు ఆన్‌చేసుకోవడం, నీరు పట్టుకున్నాక ఆటో మెటిక్‌గా బంద్ అయిపోతుంది. ఇంట్లో ట్యాంక్‌లకు వీటిని వాడినట్లయితే ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.
గైడ్ టీచర్ : ఎండీ నయిమొద్దీన్
ప్రదర్శనకైన వ్యయం: రూ.1000



లైఫ్ సేవింగ్ స్విమ్మింగ్ క్యాప్
విద్యార్థి పేరు : సుహాఆఫ్సి
తరగతి : పదో తరగతి
పాఠశాల : జీజీహెచ్ఎస్, ఆర్పీ రోడ్, నల్లగొండ.
ప్రదర్శనతో ఉపయోగం: నదులు, బావులు, చెరువుల్లో స్నానాలకు దిగినప్పుడు నీటిలో మునిగిపోకుండా కాపాడవచ్చు. ముఖ్యంగా చిన్న పిల్లలు నీటితో ఆడుకునే సమయంలో ఈక్యాప్‌ని ధరిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడవచ్చు.
గైడ్ టీచర్ : పూర్ణిమ
ప్రదర్శనకైన వ్యయం : 500.



● అవయవాల పనితీరు
నల్లగొండ జిల్లాకేంద్రంలోని డీవీఎం కళాశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు మానవ అవయవాల పనితీరుపై ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు, చిత్రంలో వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ

యువత క్రీడల్లో రాణించాలి

● తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేలు

మోత్కూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురంలో నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీల నిర్వహణతో గ్రామీణ క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. అన్ని రంగాల్లో తుంగతుర్తి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నానన్నారు. అనంతరం ఆయన క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

త్వరలోనే బునాదిగాని కాల్వ నిర్మాణానికి శంకుస్థాపన

త్వరలోనే బునాదిగాని కాల్వ నిర్మాణానికి శంకుస్థాపన చేయన్నుట్లు ఎమ్మెల్యే సామేలు అన్నారు. సుమారు రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న బునాదిగాని (ధర్మారం) కాల్వ నిర్మాణానికి తాను నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి రూ.267కోట్ల నిధులు మంజూరు చేయించగా టెండర్లు కూడా పూర్తయ్యాయన్నారు. శుక్రవారం మోత్కూరులో బునాదిగాని కాల్వ నిర్మాణానికి శంకుస్థాపన జరపడానికి ఆయన స్థల పరిశీలన చేసి మాట్లాడారు. బునాదిగాని కాల్వ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందన్నారు. కార్యక్రమాల్లో సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మునిసిపల్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కౌన్సిలర్ మలిపెద్ది రజిత, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంగాల సత్యానారాయణ, మాజీ అధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, చింతల విజయభాస్కర్‌రెడ్డి, కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు చాతరాశి అంజయ్య పాల్గొన్నారు.

మార్చి నాటికి పూర్తయ్యేలా..!



కొండపాకగూడెం వద్ద కొనసాగుతున్న పనులు

● బీ.వెల్లెంల ఎడమ ప్రధాన కాల్వ పనులు షురూ

నార్కట్‌పల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం కాల్వ పనులు ఎట్టకేలకు షురూ అయ్యాయి. డిసెంబరు 7న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన విషయం పాఠకులకు విదితమే. వచ్చే మార్చి నాటికి కాల్వలను నిర్మించి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మొదటి విడతగా 50వేల ఎకరాలకు సాగునీటిని అందించాలన్న స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం విజ్ఞప్తి మేరకు అదేరోజు కాల్వ నిర్మాణ పనులకు నిధులు కేటాయిస్తామని సీఎం ప్రకటించారు. ఆమేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఇటీవల కాల్వల భూ సేకరణ కోసం ప్రభుత్వం రూ.32కోట్లను విడుదల చేసింది. దీంతో ప్రధాన ఎడమ కాల్వ పరిధిలోకి వచ్చే గ్రామాల శివారులో తొలి విడత 50వేల ఎకరాల కింద ఇప్పటికే గుర్తించిన గ్రామాల వరకు ప్రాజెక్టు అధికారులు భూసేకరణ చేపట్టారు. కాగా ఇప్పటికే అవార్డు ప్రక్రియ పూర్తయిన రైతుల భూముల్లో కాల్వ నిర్మాణ పనులను ప్రాజెక్టు అధికారులు వేగవంతం చేశారు. కాల్వ తవ్వకాన్ని వేగవంతంగా చేయగలిగే హిటాచీ యంత్రాలను తెప్పించి పనులు ప్రారంభించారు. నేల స్వభావాన్ని బట్టి రోజుకు 100 నుంచి 150 మీటర్లు సులభంగా తవ్వగలిగే యంత్రాలను ఉపయోగిస్తున్నారు. మార్చి నాటికి కాల్వ పనులు పూర్తికావాలనే లక్ష్యంతో అధికారులు కూడా పనులను నిర్దిష్ట సమయానికి పూర్తిచేసేలా ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. కాల్వ తవ్వకానికి అభ్యంతరం వ్యక్తం చేసే రైతులను నచ్చజెప్పే బాధ్యతలను అధికార పార్టీనేతలు తీసుకుంటున్నారు. పనులను ప్రాజెక్టు ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈ విఠలేశ్వర్, ఈఈ నవీన్, బత్తుల ఊశయ్య శుక్రవారం పరిశీలించారు.

ఏదుల-డిండి లింక్‌పై నేడు కీలక నిర్ణయం

(5వ పేజీ తరువాయి)

వద్ద చెక్‌డ్యామ్ స్థానంలో రబ్బర్‌డ్యామ్ చేపట్టాలని నీటిపారుదలశాఖ ఇంజనీర్లు ప్రతిపాదిస్తున్నారు.

నిర్వాసితుల సమస్యలూ పెండింగ్‌లోనే

డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఎనిమిది రిజర్వాయర్లతో పాటు, ప్రధాన కాల్వ, తాజాగా ప్రతిపాదించిన హెడ్‌వర్క్స్‌కు సంబంధించిన నిర్మాణాలకు అవసరమైన భూమిని సేకరించే విషయంలో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తాజాగా ప్రతిపాదించిన ఏదుల రిజర్వాయర్ నుంచి ఉల్పర బ్యారేజీ వరకు చేపట్టే కీలకమైన పనులకు అవసరమైన భూసేకరణకు ఇంకా నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఉల్పరకు దిగువ నుంచి ప్రారంభమయ్యే ప్రధాన కాల్వ, డిండి ప్రాజెక్టు ఎత్తు పెంపు, అప్రోచ్ ఛానల్స్, సింగరాజుపల్లి, ఎర్రవల్లి-గోకారం, ఇర్విన్, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్ల నిర్మాణాలకు సుమారు 16,030 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. కాగా, ఇప్పటివరకు 12,052 ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా 3,978 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని గోకారం-ఎర్రవల్లి రిజర్వాయర్‌తో నిర్వాసితులయ్యే ఎర్రవల్లి, ఎర్రవల్లి తండావాసులకు, నల్లగొండ జిల్లా కిష్టరాయన్‌పల్లితో నిర్వాసితులయ్యే నాంపల్లి మండలం లక్ష్మణపురం, చింతపల్లి మండలం ఈదులగూడెం గ్రామస్థులకు, శివన్నగూడెం రిజర్వాయర్‌తో నిర్వాసితులయ్యే చర్లగూడెం, నర్సిరెడ్డిగూడెం, వెంకెపల్లి, వెంకెపల్లి తండావాసులకు మొత్తం సుమారు 1,899 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉంది. కాగా, ఇప్పటివరకు ప్యాకేజీలు కుదరకపోవడంతో నిర్వాసితుల ఆందోళనలు నిర్వహిస్తున్నారు. వీరికి పునరావాసం కల్పించే అంశంపై కలెక్టర్లు, ఎమ్మెల్యేలు ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. వీరికి ప్యాకేజీలు ఖరారైతేనే భూసేకరణ సమస్య కొలిక్కిరానుంది.

పర్యావరణ అనుమతుల కోసం ప్రయత్నాలు

డిండి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు తీసుకోకుండా ప్రారంభించనందున జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ 2022 డిసెంబరులో పనులు నిలిపివేయాలని సూచించింది. అంతేగాక రూ.92.85కోట్ల జరిమానా విధించింది. దీంతో ప్రభుత్వం పర్యావరణ అనుమతులు సాధించే బాధ్యతలను ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ)కి అప్పగించింది. అందుకోసం ఆ సంస్థకు రూ.87.95లక్షల మొత్తాన్ని కూడా చెల్లించింది. ఈ అనుమతుల కోసం ఓ వైపు ప్రభుత్వం, మరోవైపు ఈ సంస్థ కృషి చేస్తున్నా విషయం మాత్రం ఇంకా కొలిక్కిరాలేదు.

రెండున్నరేళ్లలో ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలన్నదే లక్ష్యం

డిండి ఎత్తిపోతల పథకాన్ని రానున్న రెండున్నరేళ్లలో పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఉన్నతస్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. అదే సమయంలో క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం చేస్తున్నాం. రిజర్వాయర్ల పనులు దాదాపు కొలిక్కివచ్చాయి. భూసేకరణకు, నిర్వాసితులకు పరిహారాలు, ప్యాకేజీలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే భూసేకరణ పూర్తిచేస్తాం. ఏదుల నుంచి నీటిని తరలించే పనులపై ఈఎన్‌సీ స్థాయిలో నిర్ణయం ఉంటుంది.

వెంకటేశ్వరరావు, ఎస్ఈ, ఆర్‌వీఆర్‌డీఎల్ఐ ప్రాజెక్టు

ఐదో తరగతి ప్రవేశాలకు గురుకుల సెట్-2025

● యాదాద్రి జిల్లాలో 14 గురుకులాలు, 1120 సీట్లు ● ఫిబ్రవరి 1 చివరి తేదీ



భువనగిరి టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ప్రవేశాలకు గురుకుల పాఠశాలల సొసైటీ గురుకుల సెట్-2025 షెడ్యూల్ జారీచేసింది. ఈమేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ప్రభుత్వ బాలబాలికల గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఫిబ్రవరి 23న అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1 దరఖాస్తులకు చివరి తేదీ. కాగా గురుకుల సెట్ ద్వారా జిల్లాలోని 14 గురుకులాల్లోని 1,120 సీట్లను భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షకు అర్హులు.

14 గురుకులాలు 1,120 సీట్లు

జిల్లాలోని 14 గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి 1,120 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఎస్సీ 7, బీసీ 3, జనరల్ 3, జనరల్ గురుకుల పాఠశాల 1 కాగా ఈ మొత్తంలో 8 బాలికల, 6బాలుర పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 2 సెక్షన్లుగా 80 సీట్లు ఉన్నాయి. ఆసక్తి గల విద్యార్థులందరూ ఫిబ్రవరి 1వ తేదీలోపు రూ.100 ఫీజుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వెబ్‌సైట్ www.tgcet.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

గురుకులాల్లో నాణ్యమైన విద్య, భోజనం



గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుంది. అర్హులైన బోధనా సిబ్బంది, క్రీడలతోపాటు అన్ని మౌలిక వసతులుంటాయి. ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తెచ్చిన నూతన మెనూతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం లభిస్తున్నది. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హత పరీక్ష రాయాలి. ఇందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలి.

మల్లిఖార్జున్‌రెడ్డి, డీసీవో, యాదాద్రి భువనగిరి

ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ



ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి సన్నిదిలో శుక్రవారం స్వామివారికి సువర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్రరీతిలో వేడుకలు నిర్వహించిన అర్చకులు వేకువజామున సుప్రభాతసేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతీలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టు వస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువిధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలో అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్యాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయరీతీలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి వారికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.22,87,2021 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

బుద్ధవనం శిల్పాలు ఆకట్టుకున్నాయి



విదేశీ పరిశోధకులకు బుద్ధవనం గురించి వివరిస్తున్న శివనాగిరెడ్డి

నాగార్జునసాగర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో 274 ఎకరాల్లో నిరిక్మంచిన బుద్ధవనంలో శిల్పాలు ఆకట్టుకున్నాయని విదేశీ బౌద్ధ పరిశోధకులు తెలిపారు. రెండు రోజుల సాగర్ పర్యటనలో భాగంగా విదేశీ బౌద్ధ పరిశోధకులు మొదటిరోజు ఈ నెల 2వ తేదీన నాగార్జునకొండను సందర్శించారు. రెండోరోజు శుక్రవారం బుద్ధవనాన్ని సందర్శించారు. బుద్ధవనంలో మహాస్థూపం, స్థూపవనం, జాతక వనం, చరిత వనాలను తిలకించారు. మహాస్థూపంపై ఉన్న శిల్పాలు, వాటి విశిష్ఠతను ప్రముఖ బౌద్ధ విశ్లేషకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వారికి వివరించారు. బుద్ధవనాన్ని సందర్శించిన విదేశీ బౌద్ధ పరిశోధకుల్లో న్యూజిలాండ్‌కు చెందిన ప్రొఫెసర్ సారా కెన్డన్, ఆస్ట్రేలియాకు చెందిన ప్రొఫెసర్ జాఫ్రీషా ఇంకా, హాంకాంగ్, తైవాన్‌లకు చెందిన మరో ముగ్గురు బౌద్ధ పరిశోధకులు ఉన్నారు. కార్యక్రమంలో బుద్ధవనం అధికారులు ధమ్మచారి శాసన, డాక్టర్ రవిచంద్ర, శ్యాంసుందర్, విష్ణు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌టీఆర్ఐ చైర్మన్‌గా కిషోర్‌రెడ్డి



ఎస్ఆర్‌టీఆర్ఐ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కిషోర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ (ఎస్ఆర్‌టీఆర్ఐ) చైర్మన్‌గా డాక్టర్ ఎన్.కిషోర్‌రెడ్డి శుక్రవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సంస్థ ద్వారా వివిధ ఉపాధి, ఉద్యోగ ఆధారిత ట్రేడుల్లో గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ కల్పిస్తున్నారు. గతంలో సంస్థకు డైరెక్టర్‌గా సుదీర్ఘకాలంగా పనిచేసిన అనుభవం ఉన్న డాక్టర్ కిషోర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించడంతో సంస్థ మరింత అభివృద్ధి చెందాలని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్ ఎస్ఎస్ఆర్ లక్ష్మీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, జిల్లా నాయకులు తడక రమేష్, సామ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మిర్యాలగూడ, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గాదరి కిషోర్, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్లు బండా నరేందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు చాడ కిషన్‌రెడ్డి, బిక్షమయ్యగౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో పార్టీని జిల్లాలో బలోపేతం చేయడానికి కృషి చేయడానికి ప్రజా సేవలో మరింత నిమగ్నం కావాలని కేటీఆర్ అన్నారు. ● నల్లగొండ

నిబంధనలు పాటించాలి

కనగల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని ఎస్ఐ విష్ణుమూర్తి కోరారు. కనగల్ ఎక్స్‌రోడ్డులో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ రైడ్ చేస్తూ పట్టుబడిన వాహనదారులను స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ట్రిపుల్ రైడింగ్ ప్రమాదాలకు దారి తీరుస్తుందన్నారు. ఇకపై ట్రిపుల్ రైడింగ్ చేసి పట్టుబడితే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో సోలార్ ప్లాంట్

నకిరేకల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటికల్ గ్రామ పరిధిలోని వృద్ధాశ్రమంలో రూ.2లక్షల వ్యయంతో సోలార్‌ప్లాంట్ ప్రారంభించినట్లు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు తెలిపారు. నకిరేకల్ పరిసర ప్రాంతంలోని వివిధ పాఠశాలలకు, స్థానిక జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేసినట్లు పేర్కొన్నారు. అంతకుముందు దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాబురావు, వై.మోహన్‌రెడ్డి, రాజిరెడ్డి, రేపాల మదన్‌మోహన్, కందాల పాపిరెడ్డి, రామ్మోహన్ రావు, యాదగిరిరెడ్డి, లక్ష్మి, నారాయణరెడ్డి, ప్రకాష్‌రావు, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ గుబులు



- మర్రిగూడకు ట్రిపుల్ ఆర్ రోడ్డు
- మార్కింగ్‌లతో రైతుల ఆందోళన
- భూములు పోతాయని ఆవేదన

మర్రిగూడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండల ప్రజలకు రీజనల్ రింగ్ రోడ్డు ఫీవర్ పట్టుకుంది. కొన్ని రోజుల క్రితం పలు గ్రామాల్లో ప్రభుత్వ అధికారులు కొత్తగా ట్రిపుల్‌ఆర్ మార్కు వేయడంతో సమీప గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. నలుగురు గుమికూడిన చోట ఇదే చర్చ జరుగుతోంది. గతంలో మాదిరిగానే ట్రిపుల్ ఆర్ రోడ్డు మార్గం మర్రిగూడ మండల కేంద్రానికి దిగువన వెళ్లనుంది. మండలంలోని అంతంపేట, నామాపురం, మేటిచంద్రాపురం,సరంపేట, లెంకలపల్లి, తానేదార్‌పల్లి, దామెరబీమనపల్లి మీదుగా రోడ్డు మార్గానికి సంబంధించిన గుర్తులను వేశారు. ఈ మధ్య కాలంలో గట్టుప్పల్ మండలంలోని అంతంపేట నుంచి మర్రిగూడ మండలంలోని శివన్నగూడ, సరంపేట, తానేదార్‌పల్లి మీదుగా వట్టిపల్లి, బట్టపల్లి, మర్రిగూడ ద్వారా చింతపల్లి మండలంలోని కిష్టరాయిన్‌పల్లి బీట్ రోడ్ల గుండా ట్రిపుల్ ఆర్ రోడ్డును నిర్మించడానికి ఈ మార్కులు వేసినట్లు తెలుస్తుంది. గతంలో వేసిన అలైన్‌మెంట్ మారడంతో నేరుగా మర్రిగూడ మండలంలోని శివన్నగూడ నుంచి చేసిన తాజా సర్వేతో పలు గ్రామాల్లో ట్రిపుల్ ఆర్ ఖరారైనట్లు స్పష్టమవుతుంది. ముఖ్యంగా మర్రిగూడ మండలంలోని తూర్పుతండా శివారులో కొత్తగా మార్కు వేయడంతో రైతులు తన భూములు పోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ట్రిపుల్‌ఆర్ రోడ్డు వేయడం వల్ల వ్యవసాయమే నమ్ముకుంటున్న రైతులకు సంబంధించిన భూములను ప్రభుత్వం తక్కువ ధరలకే విక్రయించమంటే మా పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికే భూములకు రూ. కోట్లలో ధర పలుకుతుందని, ట్రిపుల్ ఆర్ రోడ్డు పనులు చేపడితే సర్వం కోల్పోతున్నామన్నారు. ట్రిపుల్ రోడ్డు నిర్మాణం చేపడితే దశ తిరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు. కానీ రైతులు మాత్రం తమ భూములో కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణం పలు గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై మర్రిగూ డ తహసీల్దార్ బక్క శ్రీనివాస్‌ను వివరణ కోరగా మాకు మర్రిగూడ మండలంలో ట్రిపుల్ ఆర్ రో డ్డు నిర్మాణం చేపట్టడానికి మార్కింగ్ చేస్తున్న ట్లు, అధికారికంగా ఎలాంటి సమాచారం లేదని అన్నారు. భూములకు సంబంధించిన వివరాల గురించి మాకు ఎలాంటి ఆదేశాలు లేవని తెలిపారు.



మర్రిగూడ శివారు నాంపల్లి వెళ్లే రోడ్డులో కొత్తగా వేసిన మార్కు

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరుచుకోవాలి

నల్లగొండ టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరుచుకోవాలని మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ స్టాండింగ్ కౌన్సిల్ ఎస్.రాగాసందేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా రెడ్‌క్రాస్ భవన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. రెడ్‌క్రాస్ సంస్థ చేపడుతున్న వివిధ సామాజిక సేవ కార్యక్రమాల ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజానికి తన వంతుగా సేవ చేస్తేనే మనిషి జీవితానికి సార్థకత లభిస్తుందని అన్నారు. సమాజం లో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా యూత్ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, యూత్ వలంటీర్లు నేతి విప్లవకుమార్, ఊర శివసాయి, బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జీవీ రాములు సిబ్బంది సద్దాం హుస్సేన్, టెక్నీషియన్లు ప్రదీప్‌రెడ్డి, నిర్మల, మురళీకృష్ణ హ జ్మత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బోడ స్వామి

నార్కట్‌పల్లి, జనవరి 3 (ఆం ధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటి ప్రచారం చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ స్వామి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మండలంలోని పలు గ్రామాలకు నియమితులైన ఎస్సీసెల్ గ్రామశాఖ అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే దళితులకు న్యాయం జరుగుతుందనే విషయాన్ని తెలియజేయాలని అన్నారు. సమావేశంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు గద్దపాటి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుమర్తి ఉపేందర్, నాయకులు సత్యనారాయణ, చింత విజయ్, వెంకటేష్, శివ, బుచ్చయ్య, నరేష్, ఆంజనేయులు, సైదులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కేతేపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు బూత్ కమిటీలతో కలిసి ఐక్యంగా కృషి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడి ఎన్నికకు బూత్ కమిటీలు, పార్టీ మండల నాయకుల అభిప్రాయాలను ఆయన సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపిని పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.అనితగౌడ్, ఆర్.శ్రీనివాస్, చెరుకు రోషయ్య, పిట్టల వెంకన్న, వి.నాగయ్య, వెంకన్నచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని అర్హులైన పేదలకు పంచాలి

చిట్యాల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం గ్రామంలో గల ప్రభుత్వ భూమిని అర్హులైన పేదలకు పంచాలని సీపీఎం జిల్లా నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. గ్రామంలోని 34వ సర్వే నెంబర్‌లో గల 18 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం వారు పరిశీలించారు. సర్వే నెంబర్‌లో నాలుగు ఎకరాల భూమికి పట్టాలు ఇచ్చారని, మిగతా భూమిని కూడా అర్హులైన వారికి అందజేస్తే సాగు చేసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బొబ్బి ల సుధాకర్‌రెడ్డి, గ్రామశాఖ కార్యదర్శి పాలమాకుల అర్జున్, చొప్పరి లింగయ్య, మహేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

చిట్యాల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాతృభాషతో పాటు ఆంగ్లంలో కూడా పట్టు సాధించాలని చిట్యాల జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గోగికార్ మాధవి అన్నారు. చిట్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఇంగ్లీష్ ఒలంపియాడ్ నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గుండ్రాంపల్లి ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆనంద్, వెంకట్రావ్, లతీఫ్, లచ్చిరెడ్డి, కవిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ



చొక్కారావు

నల్లగొండ, జనవరి 3 (ఆం ధ్రజ్యోతి): అం ధుల జీవితాల్లో లూయిస్ బ్రెయి లీ వెలుగులు నింపారని ఏఐసీబీ జాతీయ ఉపాధ్యక్షుడు, డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం ఘనంగా నిర్వహిం చేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక అభివృద్ధితో పాటు అంధులకు ఇంగ్లీష్, కంప్యూటర్ విద్యను నేర్పిస్తే అందరితో సమానంగా జీవించగలుగుతారని తెలిపారు. అంధుల జీవితాల్లో అనేక మార్పులు తీసుకువచ్చి వారిని అభివృద్ధి పథంలోకి లూయిస్ బ్రెయిలీ తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వాలు అంధుల అభివృద్ధి కోసం పథకాలు అమలు చేయకపోవడంతో అంధులు నిరాశ నిస్పృహల మధ్య ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.4వేల పింఛన్ అనే పదాన్ని మార్చి నిరుద్యోగ భృతిగా నామకరణం చేసి అందించాలని కోరారు.

మోకాళ్లపై కూర్చొని హమాలీల నిరసన



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న హమాలీలు

నల్లగొండరూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పెంచిన కూలీ రేట్ల జీవోను విడుదల చేయాలని హమాలీలు చేపట్టిన సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా హమాలీ కార్మికులు వినూత్నంగా మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు పల్లే దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ హామీ మేరకు రావాల్సిన బకాయిలు, పెరిగిన జీవోని విడుదల చేయకపోతే సమ్మెని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేఎస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, జానయ్య తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో జరిగిన రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే నర్సిరెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్ముల మోహన్‌రెడ్డి, జడ్పీ సీఈవో, డీఈవో

సావిత్రీబాయిపూలే జీవితం స్ఫూర్తిదాయకం



నకిరేకల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

సావిత్రీబాయిపూలే జీవితం స్ఫూర్తిదాయకమని పలువురు నాయకులు కొనియాడారు. మహిళలు చదువుకుంటేనే ఉన్నతంగా రాణించగలరని మహిళల కోసం పాఠశాలలు నెలకొల్పి వారికి విద్యని నేర్పిన మొదటి గురువు సావిత్రీపూలే అన్నారు. బాలికా విద్యకు కృషి చేసిన సామాజిక ఉద్యమకారిణి అని తెలిపారు. దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సాంఘిక దురాచారాల నిర్మూలనకు పాటుపడ్డారని అన్నారు. జిల్లాలో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని సావిత్రీబాయి పూలే విగ్రహం, చిత్రపటానికి వివిధ బీసీ సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ మహిళా దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండల కేంద్రాల్లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవో కార్యాలయాల్లో సావిత్రీబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మునుగోడులో బీసీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సమాజ హితం కోసం ఆమె చేసిన త్యాగాలు, సేవలను స్మరిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు బూడిద లింగయ్యయాదవ్, పానుగంటి విజయ్‌గౌడ్, బూడిద మల్లికార్జున్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, కృష్ణరజక్ పాల్గొన్నారు.

నకిరేకల్ పట్టణంలోని జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే వీరేశం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఉద్దీపన వీవీఎం పాఠశాల, కేవీపీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని నర్రా రాఘవరెడ్డి భవన్, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ స్కూల్‌లో, బహుజన మహాసభ, ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించారు.

నల్లగొండ పట్టణంలో బీసీ సంక్షేమ సంఘ భవనంలో జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, నాయకులు కాసోజు విశ్వనాథం, విజయకుమార్, నకిరేకంటి కాశయ్యగౌడ్, సూర్యనారాయణ పాల్గొన్నారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్‌గౌడ్ నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కర్నాటి యాదగిరి, సతీష్ పాల్గొన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి, అనురాధ, అరుణకుమారి, నర్సింహ పాల్గొన్నారు.



నల్లగొండలో బీసీ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నాయకులు

కేతేపల్లి, కట్టంగూరు, చిట్యాల, నార్కట్‌పల్లి తదితర మండలాల్లో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డీటీ సత్తార్, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంఈవో ఎ.రాజేంద్రప్రసాద్, ఆర్ఐ చాంద్‌పాషా, బొమ్మరబోయిన సైదులుయాదవ్, గడుసు సుధీర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకటాచారి, హెచ్‌ఎం కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, కసిరెడ్డి లీలావతి, ఉప్పుల చందన, జిట్ట సరోజ, గ్యార శేఖర్, గాదె ఎల్లేష్, నర్రా శేఖర్‌రెడ్డి, శమంతకమణి, అరుణ, నర్రా రవీందర్‌రెడ్డి, ఆదినారాయణ, నరేష్, చిత్తలూరి సత్యనారాయణ, సంధ్యారాణి, కుక్కడపు శ్రీనివాస్, సంపత్ కుమార్, కృష్ణయ్య, కేతేపల్లి శ్రీను, శ్రీరాములు, సుధాకర్ పాల్గొన్నారు.

వైద్యులు పనితీరు మార్చుకోవాలి : కోమటిరెడ్డి



మర్రిగూడలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నాంపల్లి, మునుగోడు, మర్రిగూడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైద్యులు తమ పనితీరును మార్చుకొని ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శుక్రవారం ఆయన సందర్శించి ఆస్పత్రిలో ఉన్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పేరుకే ప్రభుత్వ ఆసుపత్రి అని చికిత్స, వైద్య సదుపాయాలు, వైద్యుల పనితీరు సక్రమంగా లేక రోగులు ఆర్‌ఎంపీలను, ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. వైద్యులు సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం మోడల్‌స్కూల్‌ను సందర్శించి సావిత్రీబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మర్రిగూడ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రూ.70లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యవృత్తి సేవ లాంటిందని వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని అన్నారు. మర్రిగూడలో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారి కోసం డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చే సినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో డీఎంఅండ్‌హెచ్‌వో పుట్ల మదు, డీసీహెచ్ డాక్టర్ మాతృ, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్, శంకర్‌నాయక్, కోట్యానాయక్, బీమా నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, జైపాల్‌రెడ్డి, జగాల్ రెడ్డి, వైద్యులు సమన్, మాజీ జడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రహదారులను ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. మునుగోడలోని తన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ అధికారులతో నిర్వహించిన సమీక్ష నిర్వహించారు. రహదారుల నిర్మాణాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలో నూతనంగా నిర్మించే రోడ్లు రాష్ట్రానికే రోల్ మోడల్ కావాలని సూచించారు. పదేళ్లుగా నిర్వహణకు నోచుకోని రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. నిర్మించే ప్రతి రోడ్డుకు డ్రైనేజీ, వరద కాల్వలు, పుట్‌పాత్, స్పీడ్ బ్రేకర్స్, సూచిక బోర్డులు తప్పకుండా ఉండేలా చూసుకోవాలని అన్నారు. సమావేశంలో ఉమ్మడి నల్లగొండ ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వెంకటేశ్వరావు, ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ సుధాకర్‌రెడ్డి, మునుగోడు, నాంపల్లి ఏఈలు శిరీష్, వికాస్ పాల్గొన్నారు. అంతకుముందు మునుగోడులోని పురాతనమైన శ్రీశివరామక్షేత్రంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

మర్రిగూడ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ బక్క శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య, నాయకులు రాందాసు శ్రీనివాస్, యాదయ్య, సురేందర్‌రెడ్డి ఉన్నారు. ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, వెలుగు వీవోఏలు, సమగ్ర శిక్ష ఉపాధ్యాయులు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తిచేసి పంపిణీ చేయాలి

నార్కట్‌పల్లి, కట్టంగూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన పేదలను గుర్తించి పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల, అవురవాణి గ్రామాల్లో, కట్టంగూరు మండలంలోని అయిటిపాముల శివారులో గత ప్రభుత్వం నిర్మించి అసంపూర్తిగా వదిలివేసిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తయిన ఇళ్లను అర్హులైన వారికి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని మొదలు పెట్టారని, కానీ ఇప్పటి వరకు పనులు పూర్తి చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేయాలని, పూర్తయిన వాటిని అర్హులకు అందించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల కార్యదర్శులు చింతపల్లి బయ్యన్న, పెంజర్ల సైదులు, నాయకులు చెర్కు. పెద్దులు, కల్లూరి యాదగిరి, దండు రవి, సోమనబోయిన సైదులు, కల్లూరి కంఠమహేశ్వర్, ముప్పిడి సత్యం, నాగచారి, నర్సింహ, రామలింగం, లింగయ్య, వెంకటయ్య, గంజి మురళి, సురేందర్, రవీంద్రచారి, రామస్వామి, శ్రీను, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అయిటిపాముల వద్ద అసంపూర్తి ఇళ్లను పరిశీలిస్తున్న వీరారెడ్డి, నాయకులు

పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమసంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు రెండేళ్లుగా వేల కోట్ల రూపాయలు ఫీజు బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. వెంటనే పెండింగ్ బకాయిలన్నింటినీ విడుదల చేయాలన్నారు. కాలేజీ విద్యార్థులకు సంవత్సరానికి రూ. 20వేల స్కాలర్‌షిప్ ప్రతి విద్యార్థికి మంజూరు చేయాలని, ఇంటర్మీడియట్ కోర్సులు చదివే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రేటు రూ.15వేలు పెంచాలని అన్నారు. విదేశీ విద్యనభ్యసించే విద్యార్థులందరికీ రూ.20లక్షల ఉపకార వేతనం ఇవ్వాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌లో రూ. 200 కోట్లకు పెంచి అన్ని ఉద్యోగాల్లో పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వాలన్నారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సావిత్రీబాయి జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీసీయు వజన సంఘం జిల్లా అధ్యక్షుడు మునాస ప్రసన్నకుమార్, బీసీ సంక్షేమ సం ఘం జిల్లా కోశాధికారి జేరిపోతుల రమేష్‌గౌడ్, నాయకులు పుట్ట వెంకన్నగౌడ్, పున్నా రవీందర్, శ్రీనివాస్, పగిళ్ల కృష్ణ, మల్లెబోయిన సతీష్ యాదవ్, భరద్వాజ్, శివ, మత్స్యగిరి, మోహన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

శాలిగౌరారం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో నిర్వహించే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, అన్ని అనుబంధ సంఘాలు ప్రతినిధులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొనాలని కోరారు.

శాలిగౌరారం మండల వైద్యాధికారిగా శ్వేత



డాక్టర్ శ్వేత

శాలిగౌరారం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండల వైద్యాధికారిగా డాక్టర్ శ్వేత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కట్టంగూరు మండలం అయిటిపాముల హెల్త్ సెంటర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన డాక్టర్ శిల్ప నల్లగొండ పానగల్లు అర్బన్ హెల్త్ సెంటర్‌కు బదిలీపై వెళ్లారు.

విధుల్లో జాగ్రత్తలు పాటించాలి

కనగల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది తమ విధుల్లో జాగ్రత్తలు పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్లే ప్రమాదాలకు కారణమవుతుందని ఎస్ఐ విష్ణుమూర్తి అన్నారు.మండలంలో వరుస విద్యుత్ ప్రమాదాల జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. దర్వేశిపురం బ్రిడ్జి సమీపంలో రెండురోజుల క్రితం తెగిపడిన విద్యుత్ తీగ తగిలి ఒడిశాకు చెందిన వలసకూలీ దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంలో లైన్‌మన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విద్యుత్‌ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో విద్యుత్‌ఏఈ, లైన్‌మన్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చేయూత

ఆర్థిక సహాయం అందజేత

నాంపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుంగపాడు గ్రామానికి చెందిన పాలకుర్ల వెంకటమ్మ శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ కడారి శ్రీశైలంయాదవ్ వెంకటమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటమ్మ కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆర్థిక సహాయంగా రూ. 10వేలు అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ దండిగ చంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ పచ్చిపాల అంజనేయులు, మేకల దేవేందర్, పులకరం వెంకటయ్య, శ్రీను, ముత్యాలు, నరేష్, గిరి ఉన్నారు.

మృతురాలి కుటుంబసభ్యులకు...

● చిట్యాలరూరల్: చిన్ననాటి స్నేహితురాలు మృతి చెందడంతో పూర్వ విద్యార్థులు ఆమె తల్లికి ఆర్థికసహాయాన్ని అందజేసి స్నేహాన్ని చాటుకున్నారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన కూనూరు యాదమ్మ కుమార్తె లింమాంబ మృతి చెందింది. ఆమెతో పాటు చదువుకున్న 10వ తరగతికి చెందిన 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆమె తల్లికి రూ.34 వేలు అందజేశారు. కార్యక్రమంలో చెరుకు సైదులు, కొయ్యడి సత్యానారాయణ, బెలిజ అరుణ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిప్పు అంటుకుని పూరిల్లు దగ్ధం

మర్రిగూడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పూరి గుడిసెకు నిప్పంటుకొని దగ్ధమైన ప్రమాదం మండలంలోని డీబీమనపల్లి గ్రామంలోగురువారం రాత్రి జరిగింది. బీమనపల్లి గ్రామానికి చెందిన రాంరెడ్డి తనఇంట్లో దీపం పెట్టగా ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. దీంతో ఒకేసారి మంటలు చెలరేగడంతో పూరిళ్లు దగ్ధమైంది. రూ.1.50లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 4 జనవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 78

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.5 । కనిష్ఠం 17.0



డిండి ప్రాజెక్టు

ఏదుల-డిండి లింక్‌పై
నేడు కీలక నిర్ణయం

డిండి ఎత్తిపోతల పథకంలో కీలకమైన నీటి సేకరణ పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చే అంశంపై నేడు స్పష్టత రానుంది. ఈ పథకానికి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఏదుల రిజర్వాయర్ నుంచి రోజుకు అర టీఎంసీ చొప్పున 60 రోజుల్లో 30 టీఎంసీల నీటిని తీసుకోవాలని, 2024, మార్చి 13న రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరుచేసింది. ఆ తరువాతే ఏదుల నుంచి ఉల్పర బ్యారేజీ వరకు కాల్వలు, టన్నెల్స్, చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు రూ.1788.89కోట్లతో భారీ నీటి పారుదలశాఖ ప్రతిపాదించింది. శనివారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ పనులకు ఆమోదం లభిస్తే, వెంటనే పరిపాలనా అనుమతులు మంజూరు చేసి టెండర్లు పిలవాలని ఇరిగేషన్ అధికారులు నిర్ణయించారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- రూ.1788.90కోట్లతో ఇరిగేషన్‌శాఖ ప్రతిపాదనలు
- నేడు కేబినెట్ ఆమోదిస్తే టెండర్ల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం
- ఏదుల నుంచి నీటి సేకరణ ప్రతిపాదనపై పాలమూరు నుంచి వ్యతిరేకత
- ప్రభుత్వ నిర్ణయంపైనే అందరిచూపు
- దుందుభి నదిపై చెక్‌డ్యామ్ స్థానంలో రబ్బర్‌డ్యామ్‌కు ప్రతిపాదనలు
- రెండున్నరేళ్లలో పనులు పూర్తి చేస్తామంటున్న అధికారులు

డిండి ఎత్తిపోతలకు ఏదుల నుంచి నీటిని తరలించాలని ప్రభుత్వం భావిస్తుండగా, దీనిపై పాలమూరు జిల్లా నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కరువుపీడిత ప్రాంతమైన మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాకు ఉద్దేశించిన పాలమూరు ఎత్తిపోతల పథకం నుంచి నీటిని నల్లగొండ జిల్లాలో నిర్మించే డిండికి తరలించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అక్కడి నేతలు డిమాండ్ చేస్తున్నారు. రెండు ఉమ్మడి జిల్లాల నడుమ సున్నితమైన అంశం కావడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం పీఆర్ఎల్ఐ నుంచి నీటిని తీసుకోవాలని నిర్ణయించినా, ఏ రిజర్వాయర్ నుంచి తీసుకోవాలనే అంశాన్ని తేల్చకుండా దిగువన రిజర్వాయర్ల నిర్మాణాలు పూర్తిచేస్తూ వచ్చింది. రిజర్వాయర్‌ల పనులు కొలిక్కి వచ్చిన నేపథ్యంలో నీటిసేకరణకు నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య స్థితిని ఎదుర్కొన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏదుల నుంచి నీటిని సేకరించే విషయంలో స్పష్టత ఇచ్చింది. ఈ పనులపై కేబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారా? లేక మరికొంత సమయం తీసుకుంటారా? అనే విషయం శనివారం తేలనుంది.

పోతిరెడ్డిపల్లి వద్ద చెక్‌డ్యామ్ స్థానంలో రబ్బర్ డ్యామ్?

ఏదుల రిజర్వాయర్ నుంచి ఉల్పర బ్యారేజీ వరకు అవసరమయ్యే నిర్మాణాలకు రూ.1788.89కోట్ల వ్యయమవుతుందని అంచనా వేసిన ఇంజనీర్లు ఆ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలకు కేబినెట్ సమావేశం ఆమోదం తెలపాల్సి ఉంది. ఏదుల రిజర్వాయర్ నుంచి 800 మీటర్ల అప్రోచ్ చానల్, 2.525కిలోమీటర్ల ఓపెన్ కెనాల్, 9మీటర్ల డయాతో 16కిలోమీటర్ల టన్నెల్, మళ్లీ 3.050కిలోమీటర్ల ఓపెన్‌కెనాల్ నిర్మిస్తారు. మొత్తం 21.575కిలోమీటర్ల తర్వాత ఏదుల నుంచి నీరు దుందుభినదిలోకి వెళ్తుంది. అక్కడి నుంచి 6.325కిలోమీటర్ల తర్వాత ఉన్న పోతిరెడ్డిపాడు చెక్‌డ్యామ్‌కు 1.500కిలోమీటర్ల దిగువన ఉల్పర వద్ద బ్యారేజీ నిర్మిస్తారు. అయితే పోతిరెడ్డిపాడు..

- మిగతా 7వ పేజీలో...



నేటి నుంచి పంటల నమోదు సర్వే

- ఈ నెల 8 వరకు ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశం
- ఉమ్మడి జిల్లాలోని 73 మండలాల్లో కొనసాగనున్న సర్వే
- ప్రతీ మండలంలో ఒక గ్రామం ఎంపిక
- ఆయా గ్రామాల్లో 400 నుంచి 500 ఎకరాల్లో పంటల పరిశీలన
- 'రైతు భరోసా' కోసమేనా?

క్షేత్ర స్థాయిలో పంటల సర్వేకు ప్రభుత్వం అనూహ్యంగా నిర్ణయించింది. వానాకాలంలో మెట్ట పంటలతో పాటు వరి, ఇతర పంటలు కూడా ఉంటాయి. అయితే వానాకాలం ముగిసి యాసంగి సీజన్ ప్రారంభమయ్యాక ప్రభుత్వం పంటల నమోదుకు నిర్ణయించడం విశేషం. అసలు ఈ సర్వే ఎందుకు నిర్వహిస్తున్నారనే దానిపై అధికారులకు కూడా సమాచారం లేదు. పంటల నమోదును మాత్రం ఈనెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పూర్తి స్థాయిలో నిర్వహించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. సిబ్బంది సరిపడా లేకపోతే అదనపు సిబ్బందితోనైనా సర్వే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

గత ప్రభుత్వం 'రైతుబంధు' పేరుతో ఎకరాకు రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయం అందించగా, ఎకరాకు రూ.7,500 జమ చేస్తామని ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో 14వ తేదీ నుంచి సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'రైతు భరోసా' పేరుతో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ తరుణంలో

- మిగతా 6వ పేజీలో...

ప్రశాంతంగా ముగిసిన పారా మెడికల్ పరీక్షలు

నల్లగొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో డిసెంబరు 23 నుంచి ప్రారంభమైన పారా మెడికల్ పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 1600మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన లు జరగకుండా పరీక్షల నిర్వహణకు కృషి చేసిన వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రతో పాటు ఇతర సిబ్బందిని ఆమె అభినందించారు.

అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

పీఅండ్ఎల్ ఐజీ ఎం.రమేష్



పాసింగ్ అవుట్ పరేడ్‌లో మాట్లాడుతున్న ఐజీ రమేష్

నల్లగొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బెటాలియన్‌లో శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ ప్రజలకు సమర్థ సేవలు అందించాలని పీఅండ్ఎల్ ఐజీ ఎం.రమేష్ అన్నారు. తొమ్మిది నెలల పాటు అన్నెపర్తిలోని 12వ బెటాలియన్‌లో శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఆయన మాట్లాడారు. పోలీస్‌శాఖలో అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ శాఖకు పేరు తీసుకురావాలన్నారు. తొమ్మిది నెలల కాలంలో క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి అభినందనలు తెలిపారు. మంచి వాతావరణంలో శిక్షణ పూర్తి చేసుకున్నారని, ఇక నూతన ఉత్సాహంతో సేవలు అందించాలన్నారు. అనేక సవాళ్లతో కూడిన పోలీస్‌శాఖలో ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొంటారన్నారు. బెటాలియన్ కమాండెంట్ కె.వీరయ్య మాట్లాడుతూ, తొమ్మిది నెలల కాలంలో వికారాబాద్, కామారెడ్డి, రామగుండం జిల్లాలకు చెందిన 450 మంది కానిస్టేబుళ్లు క్రమశిక్షణతో శిక్షణ పొందారన్నారు. అనంతరం శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల పరేడ్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్, అసిస్టెంట్ కమాండెంట్ వెంకటేశ్వర్లు, ఆంజనేయరెడ్డి, నర్సింగ్ వెంకన్నతో పాటు ఏవో అతీకూర్‌రెహ్మాన్, షర్మిలాదేవి, తదితరులు పాల్గొన్నారు.



అన్నింటికీ మూలాధారం సైన్స్

- కలెక్టర్ ఇలాత్రిపాఠి
- వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభించి ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అన్నింటికీ సైన్స్ మూలాధారం అని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్‌బీసీ వద్ద ఉన్న డాన్ బోస్కో పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలిసి జ్యోతి వెలిగించి ఆమె ప్రారంభించారు. అదేవిధంగా సావిత్రీబాయి పూలే జయంతి, మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సైన్స్ మన జీవనశైలి లో ఒక భాగమన్నారు. విద్యార్థులు ప్రతీ రోజు సైన్స్, గణితానికి సంబంధించి కనీసం ఒక్క పేజీ అయినా చదవడం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ, సైన్స్ ద్వారా శాంతి సమాజాన్ని సృష్టిద్దామని పిలుపునిచ్చారు. అందరూ సైన్స్ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల నైపుణ్యాలను బయటకు తీసేందుకు జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డీఈవో బి.భిక్షపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, జడ్పీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డాన్ బోస్కో స్కూల్ ప్రిన్సిపాల్ బాలశౌరి, ఉప రవా ణా కమిషనర్ వాణి, ఆర్టీవో లావణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్, ఎమ్మెల్సీ ఆవిష్కరించారు.అనంతరం విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను తిలకించారు. సందర్భంగా బాలభవన్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది.

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

(ఆంధ్రజ్యోతి, కట్టంగూరు): దరణి పోర్టల్‌లోని మాడ్యుల్స్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం కట్టంగూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీచేసి దరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించారు. కట్టంగూరు ప్రాథమిక కేంద్రాన్ని తనిఖీచేసి ఆశా కార్యకర్తలతో సమావేశమయ్యారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీవో జ్ఞానప్రకాష్‌రావు, మండల వైద్యాధికారి శ్వేత తదితరులు ఉన్నారు.

సావిత్రీబాయిపూలేకు ఘన నివాళి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): సావిత్రీబాయి పూలే జయంతి, మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి కలెక్టర్ ఇలాత్రిపాఠి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మోతీలాల్ పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

హాలియా, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందజేయాలని, సత్వర న్యాయంచేసేలా కృషి చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం హాలియా పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్, లాకప్, ఎస్‌హెచ్‌వో రూమ్‌ను, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీటీవీల ప్రాధాన్యంపై అవగాహన కల్పించి వాటి ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వినియోగంపై విద్యార్థులు, ప్రలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతీ రోజు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించాలన్నారు. దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, జూదం, అక్రమ ఇసుక, రేషన్ బియ్యం రవాణాపై ప్రత్యేక నిఘాపెట్టాలన్నారు. ప్రతీ ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరాజు, హాలియా సీఐ జనార్ధన్‌గౌడ్, ఎస్ఐ సతీష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్



వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి 6
ఎస్ఆర్‌టీఆర్ఐ చైర్మన్‌గా కిషోర్‌రెడ్డి
● బాధ్యతల స్వీకరణ 7

అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన



చర్లగూడెంలో అదనపు తరగతి గదుల నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, తదితరులు

మాడ్గులపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్లగూడెం ప్రాథమిక పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సీడీపీ నిధులు రూ.24 లక్షల తో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గదుల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమల స్వామి, పీఏసీఎస్ ఛైర్మన్ గడ్డం స్పధర్‌రెడ్డి, డైరెక్టర్ అలుగుబెల్లి సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, పీఆర్ ఏఈ మధు పాల్గొన్నారు.

కల్లెపల్లిలో మిర్చి పంట పరిశీలన



మిర్చి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు.

దామరచర్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లెపల్లి గ్రామంలోని మిర్చి పంటను ఏవో ఉమాదేవి, వ్యవసాయ శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. గ్రామ రైతులు మిర్చి దిగుబడి, తెగుళ్ల బారిన పడుతుందని, విత్తన లోపం ఉందని గ్రామస్థులు ఇటీవల ఏవోకు ఫిర్యాదు చేశారు. దీంతో మిర్చి దిగుబడి తక్కువగా రావడానికి గల కారణాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడి సాగు సమయంలో చేపట్టిన యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. హార్టికల్చర్ అధికారి నసీమా, శాస్త్రవేత్తలు నిఖిల్, ప్రశాంత్, రాములమ్మ, ఏఈవో ప్రియాంక పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో హామీలు అమలు చేయాలి : సీపీఎం

నిడమనూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలనుచిత్తశుద్ధితో అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. నిడమనూరులో శుక్రవారం నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సమావేశంలో ఆపార్టీ నాయకులు కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్, కత్తి లింగారెడ్డి, కొమాండ్ల గుర్వయ్య, నల్లబోతు సోమయ్య, వింజమూరి శివ, చంద్రశేఖర్, బాలనారాయణ, రామరాజు, యశోద, రాములు పాల్గొన్నారు.

'రైతు భరోసా'కు మోడల్ సర్వే : తహసీల్దార్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పుష్పలత

వేములపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మోడల్ సర్వేను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పుష్పలత అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. మోడల్ సర్వే కోసం మండలంలోని తిమ్మారెడ్డిగూడేనికి పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నట్లు చెప్పారు. ఈ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా గ్రామంలోని 113 సర్వే నంబర్లలో గల 940 ఎకరాల భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగు వివరాలను నమోదు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం సావిత్రీబాయిపూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో రుషేంద్రమణి, ఏఎస్‌వో రేఖలు పాల్గొన్నారు.

ముగిసిన సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాలు

చింతపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొండ్ల గ్రామ పంచాయతీలోని వెంకటేశ్వరనగర్ సంతోషిమాత ఆలయంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహానికి అభిషేకం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదంతో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ పూరె లక్ష్మణ్, అంగిరేకుల గోపాల్, డైరెక్టర్లు, మద్దెల కృష్ణ, గడ్డం ఆంజనేయులు, లక్ష్మమ్మ జంగయ్య, నారాయణచారి పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు నష్టపరిహారం పెంచాలి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి, డీఈ నాగయ్య.

పెద్దఅడిశర్లపల్లి,జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఏకేబీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్ కింద భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం పెంచాలని పీఏపల్లి మండల రైతులు ఆర్డీవో రమణారెడ్డికి మొర పెట్టుకున్నారు. శుక్రవారం అక్కంపల్లి లిఫ్ట్ ప్రేజర్ మెన్ పైప్‌లైన్ కోసం 4.23 ఎకరాల భూమిలో సర్వే నంబర్‌లో గల 43 మంది రైతులు మా భూముల మధ్యగుండా పైప్‌లైన్ పోవడంతో తమ పంట నష్టపోతున్నామన్నారు. అంతేకాకుండా తమ భూమి ఎకరం రూ.50 లక్షలు పలుకుతుందని ప్రభుత్వం మూడు విడతల్లో రూ. 9 లక్షలు చెల్లిస్తుందని అది ఏ మాత్రం సరిపోదన్నారు. అంతేకాకుండా పైప్‌లైన్ సమస్య వస్తే భూముల గుండా ఒక్క ఇరిగేషన్ అధికారులు మాత్రమే అనుమతిస్తామని, పరిహారం చెల్లించామని అందరికీ హక్కు ఉందంటే ఒప్పుకోమని ఆర్డీవోతో తెగేసి చెప్పారు. దీంతో ఇరిగేషన్ అధికారులు, ఆర్డీవో మాట్లాడుతూ రైతులు ఎవరు అధైర్య పడవద్దని భూమి లోపల 8 ఫీట్ల లోతులో శాశ్వత పరిష్కారంగా పైప్‌లైన్ నిర్మిస్తామన్నారు. పైప్‌లైన్ పూర్తయిన తర్వాత చిలకమర్రి వద్ద స్టోరేజీ ఏర్పాటు చేసి అక్కడి నుండి తిరిగి 43 మంది రైతులతో పాటు ఇతర రైతులకు సాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. పైప్‌లైన్ పూర్తయిన తర్వాత యథా విధిగా మీ పంట పొలాల చుట్టు కంచెతో భద్రపరుచుకోవచ్చు అన్నారు రైతులు అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ నాగయ్య, రైతులు పాల్గొన్నారు.

కంకర పోశారు.. వదిలేశారు

» అర్ధంతరంగా నిలిచిన మంగాపురం బీటీ రోడ్డు పనులు » మధ్యలోనే పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్ » ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

మండలంలోని మంగాపురం గ్రామానికి ఏడాది క్రితం ప్రారంభమైన బీటీ రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని వారు వేడుకోంటున్నారు.
-(ఆంధ్రజ్యోతి,వేములపల్లి)



అసంపూర్తిగా వదిలేసిన మంగాపురం- సీత్యాతండా రహదారి

మండలంలోని మంగాపురం గ్రామానికి దశాబ్ద కాలంగా సరైన రోడ్డు సౌకర్యం లేక గ్రామస్థులు అవస్థలు అన్నీ ఇన్నీ కావు. దీంతో గ్రామస్థులు కనబడిన ప్రజా ప్రతినిధికల్లా మొరపెట్టుకోవడంతో చివరికి గత ప్రభుత్వంలోని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యావతి రాథోడ్ ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధులు రూ.1.90 కోట్లతో మంజూరు చేసింది. ఆ నిధులతో మండలంలోని సల్కునూరు వ యా మంగాపురం మీదుగా సీత్యాతండా వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో అప్పటి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు రోడ్డు పనులను ప్రారంభించారు. రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వెంటనే రోడ్డు వెంట చెట్లను తొలగించి కల్వర్టు నిర్మాణాలను చేపట్టారు. అనంతరం రోడ్డును చదును చేసి కంకర పోసి రోలింగ్ చేశారు. అనంతరం నిధులు విడుదలలో జాప్యం జరుగుతుందని సదరు కాంట్రాక్టర్ ఏడాది క్రితం పను లను నిలిపివేయడంతో రోడ్డు పని మళ్లీ మొదటికి వచ్చింది. సంవత్సర కాలంగా రోడ్డు పనులు ముందుకు సాగక పోవడంతో రోడ్డుపై పరిచిన కంకర ఎక్కడికక్కడ తేలడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం ద్వారా ఉమ్మడి మండలంలోని తోపుచర్ల, సీత్యాతండా, ఇసుకబావిగూడెం, కుక్కడం గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మరోవైపు రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో గ్రామానికి వచ్చే ఒక్క బస్సు సైతం రాకుండా పోవడంతో విద్యార్థులు, వృద్ధులు తమ ప్రయాణాలకు తీవ్ర అవ స్థలకు గురవుతున్నారు. దీంతో ప్రతి రోజు విద్యార్థులు తమ పాఠశాలకు వెళ్లేందుకు సుమారు 5కిలో మీటర్లు నడిచి సల్కునూరు క్రాస్ రోడ్డు వరకు వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై గ్రామస్థులు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించిన నిధులు తమ శాఖ పరిధిలో కాకపోవడంతో తామేమి చేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆర్‌అండ్‌బీ అధికారులు పేర్కొంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు. సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఈ విషయమై సంబంధిత గిరిజన సంక్షేమశాఖ ఏఈ నవీన్‌ను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా లిఫ్ట్ చేయలేదు.

వెంటనే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి



ఏడాది కాలంగా రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకగా కొనసాగుతుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. రోడ్డుపై కంకర తేలడంతోపాటు భారీ వాహనాలు వచ్చినప్పుడు కంకర దువ్వ లేస్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నాం. సంవత్సరం కాలంగా రోడ్డు పనులు చేపట్టకుండా బస్సులు, ఆటోలు సైతం గ్రామానికి రాక తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వెంటనే రోడ్డు పనులు పూర్తయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.
- ముదిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (మంగాపురం,గ్రామస్థుడు

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

● సబ్ కలెక్టర్ నారాయణ అమిత్



మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రవాణా శాఖ అధికారులు

మిర్యాలగూడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రత నిబంధనలు పాటించాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. ఎంవీఐ వీరాస్వామితో కలిసి జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్‌ను, బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1 నుంచి 31వ తేదీవరకు భద్రతా మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, ఆర్టీఏ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

నాగార్జునసాగర్,జనవరి3(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉన్నపుడే శ్రద్ధగా చదువగలుగుతారని ఆర్‌బీఎస్‌కే వైద్యుడు డాక్టర్ రాం బాబు అన్నారు. స్థానిక హిల్‌కాలనీలో బీసీ గురు కుల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సకాలంలో ఆహారం తీసుకోవాలని, సరిపడా నీటిని తాగి సరిపడా నిద్ర పోవాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజశేఖర్ , హెల్త్ అసిస్టెంట్లు నాగమణి, రజని, ఏఎన్ఎంలు సునీత, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 149 మంది లబ్ధి దారులకు మంజూరైన రూ.52,53, 500 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను స్థానిక క్యాంపు కార్యాల యంలో శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆపదలో ఉండి దరఖాస్తులు చేసుకున్న బాధితు లందరికీ వైద్యం కోసం నిధులు కేటాయించి సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సావిత్రి బాయి పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సావిత్రి బాయి పూలే జయంతి క్యాంపు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్ర మాల్లో మాజీ ఎంపీపీ జాన్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, లోకసాని శ్రీధర్‌రెడ్డి, దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, కొర్ర రాంసింగ్, అధికారులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

మిర్యాలగూడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఐద్వా, డీవైఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని హౌసింగ్ బోర్డులో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లా డుతూ ముగ్గుల పోటీలు సంప్ర దాయానికి ప్రతీక అన్నారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తేవాల్సిన అవసరం వుందని అన్నారు. కార్యక్ర మంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, నాయకులు గౌతంరెడ్డి, రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, పరశురాములు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న డబ్బికార్ మల్లేష్, పాలడుగు ప్రభావతి

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి



దేవరకొండ ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దేవరకొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దేవరకొండలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేవరకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. మూడేళ్లుగా రాష్ట్రంలో బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ విద్యార్థుల రూ.4,500 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరచారి, ఏకుల రాజరావు, అంకం చంద్రమౌళి, వెంకటయ్య, గోవిందు పాల్గొన్నారు.

సమాచారం

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

డిండి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిండి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శిరీష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంగ్లిష్ మీడియంలో చేరేందుకు ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కుల, ఆదాయ, ఆధార్‌కార్డు, జనన ధ్రువపత్రాలు దరఖాస్తుకు జత చేయాలని కోరారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలని సూచించారు.

పీఆర్టీయూ టీఎస్ గుడిపల్లి కార్యవర్గం ఎన్నిక



లక్ష్మీనర్సయ్య, నాగయ్య

పెద్దఅడిశర్లపల్లి, జనవరి3(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ టీఎస్ గుడిపల్లి మండల కార్యవర్గాన్ని మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.లక్ష్మీనర్సయ్య, ప్రధానకార్యదర్శిగా ఎ.నాగయ్యతో పూర్తి కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వి.శ్రీనివాసులు తెలిపారు. కొత్త కార్యవర్గ సభ్యు లను ఆ సంఘం పీఏపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు కేతావత్ మూనా, ఆర్.అనిల్ కుమార్, జిల్లా సంఘం నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి ఉమ్మడి మండల ఎంఈవోలు వెంకటయ్య, సముద్రాల శ్రీనయ్య, పెద్దిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నగేష్, కృప పాల్గొన్నారు.

కంప్రెషర్ ట్రాక్టర్ చోరీ

దేవరకొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): దేవరకొండసంజయ్‌కాలనీలో రూపాని శ్రీనుకు చెందిన కంప్రెషర్ ట్రాక్టర్ చోరీకి గురైంది. డిసెంబరు 26న ఇంటి వద్ద ట్రాక్టర్‌ను పార్కింగ్ చేశాడు. వివిధ పనుల కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. శుక్రవారం దేవరకొండకు చేరుకొని చూడగా ట్రాక్టర్ చోరీకి గురైనట్లు గుర్తించాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సావిత్రీ బాయి పూలే జీవితం స్ఫూర్తి దాయకం

● మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ● ఘనంగా సావిత్రీ బాయి జయంతి వేడుకలు ● నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు , అధికారులు



మిర్యాలగూడ క్యాంపు కార్యాలయంలో సావిత్రి బాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్



మిర్యాలగూడ సావిత్రీ బాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



పీఏపల్లి : ఆదర్శ పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

మిర్యాలగూడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యావేత్త, సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జీవితం స్ఫూర్తి దాయకమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం సావిత్రీ పూలే జయంతి సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సావిత్రీబాయి పూలే అణగారిన వర్గాల వారి హక్కుల కోసం చేసిన కృషిని గౌరవిస్తూ జనవరి 3ను మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రక టించి అధికారంగా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో గాయం ఉపేందర్‌రెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, సైదులు, సాయి, నరేందర్ పాల్గొన్నారు.

ధీర వనిత సావిత్రీబాయి పూలే

మహిళల హక్కుల కోసం పోరాడిన ధీర వనిత సావిత్రీబాయి పూలే అని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సావిత్రీ బాయి చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి, (ఆంధ్రజ్యోతి): పీఏపల్లి మండలం ఆదర్శ పాఠశాలలో కోటిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, ఎంపీడీవో చంద్రమౌళి, ప్రిన్సిపల్ శ్రీనయ్య పాల్గొన్నారు.

● పెద్దవూర, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళా ఉపాధ్యాయులనుసన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో తరిరాము, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● హాలియా,(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పీఆర్టీయూ టీఎస్, టీఎస్ యూటీఎఫ్ అధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో గుండా కృష్ణమూర్తి రామకృష్ణారెడ్డి, నోవా అరవింద్ కుమార్, నాగేశ్వర్‌రావు, రవి, షాబుద్దీన్, మధు, చెన్ను వెంకట్‌రెడ్డి, మందా సైదులురావుగౌతమ్, రవి, సయ్యద్ అలీ, అక్కయ్యబాబు, శివర్ల వెంకటయ్య, మనాది శ్రీలత, జిల్లా పరిషత్ మహిళా ఉపాధ్యాయురాలు శైలజ, శకుంతల, పార్వతమ్మ, కృష్ణవేణి, శ్రీదేవి, సునీత, ముడావత్ లక్ష్మణ్‌నాయక్, మెగావత్ మంగా బాయి, లక్ష్మీ బాయి, యడవల్లి సీతారామయ్య, యడవల్లి కృష్ణప్రసాద్, వడ్త్యా వాల్యా నాయక్, హతీరాం పాల్గొన్నారు.

● చింతపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజమూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను పలువురు సన్మానించారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్‌వీ మండల అధ్యక్షుడు ఆరేకంటి మురళి ఆరే కంటి జగన్, కొప్పుల దయానంద్, ఆధ్యాపక బృందం రేహనబేగం, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి): హిల్‌కాలనీ బీసీ గురుకుల పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో, పైలాన్ కాలనీలో ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ రాజశేఖర్, హెచ్ఎం శేషు, ఎస్ఎఫ్ఐ నాయకులు జగదీష్, కోరే రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లి,(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సావిత్రీ బాయి చిత్రపటానికి తహసీల్దార్ సురేష్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్యాంసుందర్, ఏపీఎం శేషయ్య సిబ్బంది పాల్గొన్నారు.

● నిడమనూరు (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ కార్యాలయంలో సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంకతి సత్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి తోట చందర్‌రావు, నాయకులు కొండా శ్రీనివాస్ రెడ్డి, ముంగి శివమారయ్య, విశ్వనాధుల రమేష్, మెరుగు మధు, పగిళ్ల శివ పాల్గొన్నారు.

● దామరచర్ల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఎంఈవో బాలాజీనాయక్ సావిత్రీ బాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రత్యేక అధి కారి సరిత, పద్మ పాల్గొన్నారు. అలాగే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలే చిత్రపటానికి నివా ళుల ర్పించారు. కార్యక్రమంలో విష్ణు, రాహుల్, చరణ్, శంకర్, సందీప్, నరసింహా, అజయ్, జగన్ పాల్గొన్నారు.



హాలియా : జడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు



పెద్దవూర : మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు